ఆదివారం
31-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 40
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



శభాష్ సర్గార్

వెయిట్ లిఫ్టింగ్‌లో సంకేత్ మహదేవ్‌కు రజతం

- 61 కేజీల విభాగంలో గురురాజ పూజారీకి కాంస్యం
- కామన్వెల్త్‌లో పతకాల ఖాతా తెరిచిన భారత్
- ఈత విభాగంలో ఫైనల్‌కు చేరిన శ్రీహరి

బర్మింగ్‌హామ్: ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. బర్మింగ్‌హామ్ వేదికగా జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో భారత వెయిట్ లిఫ్టర్ సంకేత్ మహదేవ్ సర్గార్ రజతంతో భారత్‌కు తొలి పతకాన్ని అందించాడు. శనివారం జరిగిన పురుషుల వెయిట్ లిఫ్టింగ్ 55 కేజీల విభాగం ఫైనల్లో 248 కేజీల బరువు ఎత్తిన సంకేత్ సర్గార్ త్రుటిలో స్వర్ణపతకాన్ని చేజార్చుకున్నాడు. క్లీన్ అండ్ జర్క్‌లో తొలి ప్రయత్నంలోనే 135 కేజీల బరువెత్తిన మహదేవ్.. రెండు, మూడో ప్రయత్నంలో 139 కేజీల బరువు ఎత్తలేకపోయాడు. రెండో ప్రయత్నంలో గాయపడ్డ అతను.. మూడోసారి ప్రయత్నించడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే అతని కుడి మోచేయి సహకరించలేదు. స్నాచ్ విభాగంలో మూడో ప్రయత్నంలో 113 కేజీల బరువు ఎత్తి

- మిగతా 2 లో

పారా హుషార్...!

- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో 'బార్ల' వేలం
- ఎక్కడికక్కడే మద్యం సిండికేట్లు
- విశాఖలో రూ.60 లక్షలకే లైసెన్స్
- బిడ్డర్లు పోటీపడ్డ తిరుపతిలో రూ.కోటీ 56 లక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా బార్ల లైసెన్సుల కోసం జరుగుతున్న బిడ్డింగ్ ప్రక్రియ అధికార పార్టీ నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. అధికార పార్టీ నాయకుని అండ లేకుండా, వారి భాగస్వామ్యం లేకుండా వేలం పాటలో పాల్గొనే పరిస్థితి కానరావడం లేదు. బార్ లైసెన్స్‌ల మంజూరు ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్, పారదర్శకమంటూ పాలకులు చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో జరిగే తంతుకి ఏమాత్రం సంబంధం ఉండడం లేదు. అధికార పార్టీ నేతలు ఎక్కడికక్కడ దరఖాస్తుదారులను సిండికేట్ చేసి, వేలంలో పోటీ లేకుండా కారు చౌకగా బార్ లైసెన్స్ దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు రావల్సిన వేల కోట్ల ఆదాయానికి గండిపడుతోంది. సహజంగా బార్‌లకు ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా లైసెన్స్ ఫీజు పెంచి రెన్యువల్ చేస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వం కల్పతరవు లాంటి మద్యాన్ని గుప్పిట్లో పెట్టుకునేందుకు కొత్త పాలసీని తెచ్చింది. ఈ పాలసీ ప్రకారం సెప్టెంబరు 1వ తేదీ నుంచి 2025 ఆగస్టు 31వ తేదీ వరకు మూడు సంవత్సరాల గడువుతో లైసెన్స్ మంజూరు చేయనున్నారు. అందుకోసం ఈనెల 21వ తేదీ నోటిఫికేషన్ జారీ చేసి, 30,31 తేదీల్లో ఆన్‌లైన్ వేలం నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 840 బార్లకు కొత్త లైసెన్స్ మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, నగర పంచాయితీలకు లైసెన్స్ ఫీజులు వేర్వేరుగా నిర్ణయించారు. ఆ మేరకు తొలుత బిడ్డర్లు పోటీ పడ్డారు. మొత్తం 1,672 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అంత భారీ స్థాయిలో నమోదు కావడంతో ఎంత లేదన్నా వారిలో కనీసం 1,500 మంది రుసుములు చెల్లించి వేలంలో పాల్గొంటారని అందరూ భావించారు. కానీ అప్పుడే అధికార పార్టీ ఆపరేషన్ ప్రారంభమైంది. అంతే వేలం దగ్గరకు వచ్చేసరికి

- మిగతా 2 లో

ప్రజల గడపకు న్యాయం

- ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావాలి
- కోర్టులకు రాగలిగింది కొందరే - మౌనంగా రోదిస్తున్న అనేకమంది
- విచారణ ఖైదీల విముక్తిపై దృష్టి అవశ్యం
- జిల్లాస్థాయి వ్యవస్థలే న్యాయవ్యవస్థకు వెన్నెముక
- ఐటీతో సేవల విస్తరణ
- అఖిలభారత జిల్లా న్యాయ సేవల యంత్రాంగం సదస్సులో సీజేఐ రమణ, ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఈ దేశంలో చాలా మంది ప్రజలు న్యాయవ్యవస్థపై సరైన అవగాహన లేక, న్యాయ సహకారం అందక మౌనంగా బాధపడుతున్నారనీ, కొందరు మాత్రమే కోర్టుల వరకు రాగలుగుతున్నారనీ, ప్రతి ఒక్కరికి న్యాయం అందుబాటులోకి రావాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఎన్వీ రమణ అన్నారు. న్యాయాన్ని ప్రజల ఇంటి గడపకు చేర్చగలిగేలా జిల్లా స్థాయిలో న్యాయవ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయి న్యాయ వ్యవస్థలే న్యాయవ్యవస్థకు వెన్నెముక అని చెప్పారు. న్యాయం అన్నది సామాజిక ముక్తి సాధనం కావాలని ఆకాంక్షించారు. న్యాయం అందించే గతిని పెంచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దోహదమవుతున్నట్లు ఆయన తెలిపారు. భారత్ 75వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో సులభతర జీవితం తరహాలో సులభంగా న్యాయం అందడం కూడా అంతే అవసరం అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. వివిధ జైళ్లలో మగ్గుతున్న విచారణ ఖైదీలకు విముక్తి కల్పించే దిశగా న్యాయ చర్యలు ఉండాలని సూచించారు. సీజేఐ రమణ, ప్రధాని మోదీ శనివారం ఢిల్లీలో జరిగిన అఖిలభారత జిల్లా న్యాయ సేవల యంత్రాంగం సదస్సులో మాట్లాడారు. న్యాయ వ్యవస్థపై ప్రజలకు

- మిగతా 2 లో

పోలవరంతో భద్రాద్రికి ముప్పే

తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

హైదరాబాద్: పోలవరం బ్యాక్ వాటర్‌పై అధ్యయనం చేయాలని ప్రాజెక్టు అథారిటీని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఇటీవల గోదావరికి పోటెత్తిన భారీ వరద నేపథ్యంలో తెలంగాణ నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్ పోలవరం ప్రాజెక్టు అథారిటీకి లేఖ రాశారు. పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై గతంలోనే కేంద్ర జలశక్తి బోర్డు దృష్టికి తీసుకెళ్లామని లేఖలో పేర్కొన్నారు. తాజాగా గోదావరికి భారీగా వరదలు రావడంతో భద్రాచలం వద్ద 99 గ్రామాలు ముంపునకు గురయ్యాయని.. దాదాపుగా 27 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని స్పష్టం చేశారు. ఎఫ్‌ఆర్‌ఎల్ వద్ద నీటి నిల్వ ఉంటే ముంపు ఎక్కువగా ఉంటుందన్న ఈఎన్సీ మురళీధర్.. 26 లక్షల క్యూసెక్కుల బ్యాక్ వాటర్‌పై అధ్యయనం చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలానికి బ్యాక్‌వాటర్ ముప్పు ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తే ఏటా భద్రాచలానికి ముంపు తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని పోలవరం బ్యాక్ వాటర్‌పై స్వతంత్ర సంస్థ ద్వారా అధ్యయనం చేయించాలని తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ ప్రాజెక్టు అథారిటీని కోరారు.

రూ.110 కోట్ల 'కార్వీ' ఆస్తులు అటాచ్ : ఈడీ

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకరింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్)పై మనీలాండరింగ్ కేసు విచారణ క్రమంలో రూ.110 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం అటాచ్ చేసింది. కార్వీ గ్రూపు అక్రమంగా రుణాలు పొందినట్లు బ్యాంకులు చేసిన ఫిర్యాదులపై హైదరాబాద్ పోలీసుల ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ కేసు నమోదు కాగా దీనిని ఈడీ విచారిస్తోంది. ఇప్పటివరకు మొత్తం రూ.2,095 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. అయితే రూ.2,800 కోట్ల విలువ చేసే క్లయింట్ల వాటాలను తనఖా పెట్టి కార్వీ గ్రూపు రుణాలు పొందినట్లు బ్యాంకులు ఆరోపించాయి. ఎన్ఎస్ఈ, సెబీ ఉత్తర్వుల ప్రకారం క్లయింట్ల సెక్యూరిటీల విడుదల తర్వాత ఆ రుణాలన్నీ ఎన్పీయేలు మారినట్లు తెలిపాయి. దీంతో నేరాదాయం పరాయీకరణ కాకుండా రూ.110.70 కోట్లు విలువ చేసే చరాస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ తాజా ప్రకటన పేర్కొంది. ఈ కేసులో కేఎస్‌బీఎల్ సీఎండీ సి.పార్థసారథి, గ్రూపు సీఎఫ్ఓ జి.కృష్ణహరి జనవరిలో అరెస్టు కాగా వీరిద్దరూ బెయిల్‌పై విడుదల అయ్యారు. అనేక డొల్ల కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలను వాడి ఒక క్లిష్టమైన ఆర్థిక లావాదేవీల ఉచ్చును కార్వీ అల్లిందని ఈడీ ఆరోపించింది. గ్రూప్ కంపెనీలకు పెట్టుబడులు/షేర్ క్యాపిటల్/స్వల్పకాలిక అడ్వాన్స్‌లు/రుణాల రూపంలో పెద్ద మొత్తంలో నేరాదాయం రాగా దానిని 'పెట్టుబడి'గా మార్చిందని పేర్కొంది. తన కుమారులు రజత్, అధిరాజ్‌లకు ఆర్థిక ప్రయోజనాలను గ్రూపు కంపెనీల ద్వారా అందేలా ఏర్పాట్లను పార్థసారథి చేసినట్లు ఈడీ వెల్లడించింది. ఆ డబ్బు వేతనాలు, ఇంటి ఖర్చుల రీయింబర్స్‌మెంట్ రూపేణ కుటుంబ సభ్యుల చేతుల్లోకి వెళ్లడం ద్వారా తెల్లధనమైందని పేర్కొంది. కేడీఎంఎస్ఎల్ ఎండీ వి.మహేశ్, కార్వీ గ్రూపు సీనియర్ అధికారి, కీలక పరిపాలన సభ్యుడు; పార్థసారథికి సన్నిహితుడని, మనీలాండరింగ్‌లో క్రియాశీల పాత్ర పోషించారని ఈడీ ప్రకటన పేర్కొంది. లక్షలాది మంది క్లయింట్లతో దేశంలోనే దిగ్గజ స్టాక్ బ్రోకర్లలో ఒకటిగా వెలుగొందిన కేఎస్‌బీఎల్ గుట్టు 2019లో ఎన్ఎస్ఈ పర్యవేక్షణ క్రమంలో రట్టు అయింది. ఈ కుంభకోణం వెలుగు చూసింది. కేఎస్‌బీఎల్ డీపీ

- మిగతా 2 లో

విశ్వనగరంగా హైదరాబాద్

మంత్రి హరీశ్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటోందని, అనేక రంగాలకు కేంద్రంగా మారిందని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా హైదరాబాద్ ఉందన్నారు. కోవిడ్-19 అన్ని రంగాలకు దెబ్బ తీసిందని, రియల్ ఎస్టేట్ రంగంపైన తీవ్ర ప్రభావం పడిందని చెప్పారు. అయినా ఇప్పుడు పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం అన్ని రంగాలు ముందుకు వెళుతున్నాయని, అదే రీతిలో తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా పుంజుకుంటోందని పేర్కొన్నారు. తెలంగాణ తన అస్థిత్వాన్ని నిలబెట్టుకుందని, అన్ని రంగాల్లో దేశానికి రోల్ మోడల్ అయిందని తెలిపారు. తెలంగాణకు ఇప్పుడు ఓ బ్రాండ్ ఇమేజ్ వచ్చిందని తెలిపారు. సీఎం కేసీఆర్ కృషితోనే అది సాధ్యమైందని చెప్పారు. నేడు దేశంలో అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతంగా హైదరాబాద్ నగరంగా పేరు పొందిందని, చక్కటి వాతావరణం, 24 గంటల కరెంటు, తాగు నీటి కొరత లేని ప్రాంతంగా మారిందన్నారు. మెట్రో, ఆర్టీసీ వంటి రవాణా సదుపాయాలు, మంచి విద్యాలయాలు, అత్యాధునిక వైద్య సదుపాయాలున్న నగరంగా విశిష్టత పొందిందని తెలిపారు. హైదరాబాద్‌కు ఎవరు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

బాల్యానికి భరోసా ఏది?

- పోషకాహార లోపంతో పెరుగుదల సమస్య
- 35 శాతానికి పైగా పిల్లలది ఇదే పరిస్థితి
- ఆరోగ్య నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ: బాల్యం బక్కచిక్కి పోతోంది. దేశంలోని చిన్నారుల్లో పోషకాహార లోపం రోజురోజుకూ తీవ్ర సమస్యగా మారుతోంది. వారిలో పెరుగుదలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. మహిళల్లోనూ పోషకాహారం లోపం తీవ్ర సమస్యగా పరిణమించింది. జాతీయ కుటుంబ సర్వే సమాచారంతో పాటు ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. దేశంలోని చిన్నారులు, మహిళల్లో ప్రస్తుత పరిస్థితులపై వైద్య, ఆరోగ్య నిపుణులు ఆందోళనను వ్యక్తం చేశారు. 2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) ఫలితాల ప్రకారం.. పిల్లల్లో పెరుగుదల లోపం (వయసుకు తగిన ఎత్తు లేకపోవటం) 35.5 శాతంగా ఉన్నది. అలాగే, వేస్టింగ్ (ఎత్తుతో పోలిస్తే తగిన బరువు ఉండకపోవటం) 19.3 శాతం, తక్కువ బరువు 32.1 శాతంగా నమోదయింది. కాగా, పోషకాహార లోపం ప్రపంచంలోనే భారత్‌లో అధికంగా ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరించారు. పెరుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లలు మేఘాలయలో

- మిగతా 2 లో

గుజరాతీలు, రాజస్థానీలను పంపించేస్తే

ముంబైలో డబ్బుండదు



- ఆర్థిక రాజధానిగా పేరును కోల్పోతుంది
- మహారాష్ట్ర గవర్నర్ కోశ్యారీ

ముంబై: గుజరాతీలు, రాజస్థానీలను నగరం నుంచి పంపించేస్తే ముంబైలో డబ్బు ఉండదని, దేశ ఆర్థిక రాజధానిగా పేరును కోల్పోతుందని మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన చేసిన ప్రకటనపై రాజకీయ పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో దుమారం రేగింది. అయితే గవర్నర్ శనివారం తాను చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. మహారాష్ట్ర పురోగతి, అభివృద్ధిలో మరాఠీ మాట్లాడే ప్రజల కృషిని కించపరిచే ఉద్దేశం తనకు లేదని కూడా స్పష్టం చేశారు. గవర్నర్ పై విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ముంబై పశ్చిమ శివారు ప్రాంతం అంధేరీ చౌక్ నామకరణ కార్యక్రమం అనంతరం గవర్నర్ మాట్లాడుతూ 'మహారాష్ట్ర నుంచి గుజరాతీలు, రాజస్థానీలను తొలగిస్తే, మీ వద్ద డబ్బు

- మిగతా 2 లో

ఇరాక్ పార్లమెంటులో మిన్నంటిన నిరసనలు

బాగ్దాద్: ఇరాక్ పార్లమెంట్‌లో అవినీతికి వ్యతిరేకంగా ఇరాకీ షియా మతగురువు మొక్తాదా అల్-సదర్ మద్దతుదారులు శనివారం తీవ్రంగా ప్రతిఘటించారు. ప్రధానమంత్రి పదవికి మొహమ్మద్ షియా అల్-సుడానీ అభ్యర్థిత్వాన్ని నిరసనకారులు ఖండించారు. అతను ఇరాన్‌తో సన్నిహితంగా ఉంటాడని వారు నిరసించారు. అల్-సుడానీ మాజీ మంత్రి, మాజీ-ప్రావిన్షియల్ గవర్నర్, కోఆర్డినేషన్ ఫ్రేమ్‌వర్క్ తరపున ప్రధాన మంత్రి పదవికి నామినేట్ అయ్యారు. ప్రత్యర్థి ఇరాన్-మద్దతుగల పార్టీలు ప్రధానమంత్రి అభ్యర్థిత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో షియా నాయకుడు ముక్తాదా అల్-సదర్ మద్దతుదారులు శనివారం ఇరాక్ ప్రధాన మంత్రి భవనానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరాకీ సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్ భవనానికి రహదారులను మూసివేసింది, ప్రదర్శనకారులు ఇరాకీ జెండాలు, అల్-సదర్ చిత్రపటాలను ఊపుతూ, నినాదాలు చేశారు. చట్టసభ సభ్యులు ఎవరూ హాజరుకాకుండా శాసన సభలో కూర్చున్నారు. వేలాది మంది నిరసనకారులు పార్లమెంటు భవనం వెలుపల ప్రదర్శన చేపట్టారు. భద్రతా దళాలు వారిని చెదరగొట్టడానికి టియర్ గ్యాస్, వాటర్ ఫిరంగులు, సౌండ్ గ్రెనేడ్‌లను ఉపయోగించాయి. బుధవారం వందలాది మంది నిరసనకారులు ఇరాక్ రాజధాని మధ్యలో ఉన్న గ్రీన్ జోన్‌లోకి ప్రవేశించి నిరసనచేపట్టారు. వందలాది మంది నిరసనకారులు శనివారం ఇరాక్ పార్లమెంట్ భవనంపైకి ఎక్కి బుధవారం నాటి అశాంతిని పునరావృతం చేశారు. నిరసనకారులు లోపలికి ప్రవేశించడంతో చట్టసభ సభ్యులు ఎవరూ లేరు. భద్రతా బలగాలు మాత్రమే భవనం లోపల ఉన్నారని అల్ జజీరా నివేదించింది.

ముందస్తు ఎన్నికలకు ఇరాక్ కమ్యూనిస్టుల డిమాండ్

దేశంలో నెలకొన్న రాజకీయ ప్రతిష్టంభన మధ్య ఇరాక్ కమ్యూనిస్టులు (ఐసీపీ) ముందస్తు ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశం రాజకీయ ప్రతిష్టంభనలో ఉన్నందున స్వతంత్ర మధ్యంతర ప్రభుత్వం పర్యవేక్షణలో ముందస్తు ఎన్నికలకు పిలుపునిచ్చింది. మాజీ ప్రధాన మంత్రి నౌరీ అల్-మాలికీ తన మిత్రపక్షాలు షియా మతగురువు ముక్తాదా అల్-సదర్‌ను ఎదుర్కోవడానికి శనివారం షాట్‌గన్‌తో ఆయుధాలు ధరించి వీధుల్లోకి వచ్చారు. సదర్ మద్దతుదారులు బుధవారం ముందు ఇరాక్ పార్లమెంట్‌ను ముట్టడించారు, ఎందుకంటే వారు మహ్మద్ అల్-సుడానీని దేశ ప్రధానమంత్రిగా నామినేట్ చేయడాన్ని వ్యతిరేకించారు, దీనికి మాలికీ మద్దతు ఇచ్చారు. ఈ నేపథ్యంలో దేశం మరింత గందరగోళానికి, హింసకు దిగుతుందేమోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మతపరమైన జాతుల మధ్య కీలక పదవులను విభజించే సెక్టారియన్ అధికార-భాగస్వామ్య వ్యవస్థను ఐసీపీ ఖండించింది, అధికారం కోసం కొనసాగుతున్న పోరాటాలు దేశ నిర్మాణం కోసం పోరాటానికి ప్రాతినిధ్యం వహించవని కమ్యూనిస్టులు నొక్కి చెప్పారు.

బాల్యానికి భరోసా ఏది?

(మొదటిపేజీ తరువాయి)

అత్యధికంగా (46.5 శాతం) ఉన్నారని ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గణాంకాలు తెలిపాయి. ఆ తర్వాత స్థానంలో బీహార్ (42.9 శాతం) ఉంది. అసోం, దాద్రానగర్ హవేలీ, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ జాతీయ సగటు 35.5 శాతం కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. పుదుచ్చేరి, సిక్కింలో ఈ సమస్య శాతం అత్యల్పంగా ఉంది. ఎత్తుకు తగిన బరువు లేని చిన్నారుల సంఖ్య మహారాష్ట్రలో 25.6 శాతంగా ఉంది. ఆ తర్వాతి స్థానంలో గుజరాత్ (25.1 శాతం) ఉన్నది. అసోం, బీహార్, దాద్రా, నగర్ హవేలి, కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లో జాతీయ సగటు 19.3 శాతం కంటే ఎక్కువ మంది చిన్నారులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. తక్కువ బరువు సమస్యను ఎదుర్కొంటున్న చిన్నారుల సంఖ్య బీహార్‌లో అత్యధికంగా (41 శాతం), ఆ తర్వాత గుజరాత్ (39.7 శాతం), జార్ఖండ్ (39.4 శాతం) ఉన్నాయి. చిన్నారుల్లో ఈ సమస్య అసోం, దాద్రా-నగర్ హవేలీ, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, యూపీలో జాతీయ సగటు 32.1 శాతం కంటే ఎక్కువగా ఉంది. అయితే, పై రెండు సమస్యల్లో (ఎత్తుకు తగిన బరువు, తక్కువ బరువు)నూ మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ రెండో స్థానంలో ఉండటం గమనార్హం.

పోషకాహార లోపంతో మహిళలు

ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 సమాచారం ప్రకారం.. జార్ఖండ్‌లో అత్యధిక శాతం మంది స్త్రీలు (15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసు కలిగినవారు) తక్కువ బీఎంఐను కలిగి ఉన్నారు. వీరిలో చాలా మంది పోషకాహార సమస్యను ఎదుర్కొంటున్నారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశాలోనూ పోషకాహార లోపం ఉన్న మహిళలు అధికంగా ఉండటం గమనార్హం. కాగా పోషకాహార లోపాన్ని అరికట్టేందుకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ కొన్ని ప్రత్యేక లక్ష్యాలను విడుదల చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ మంత్రి స్మృతి ఇరానీ రాజ్యసభలో ఒక లిఖిత పూర్వక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరేళ్ల కంటే తక్కువ వయసున్న చిన్నారుల్లో పెరుగుదల లోపం, పోషకాహార సమస్యను ఏడాదికి రెండు శాతం తగ్గించాలని మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే తక్కువ జనన బరువును ఏడాదికి రెండు శాతం తగ్గించటం, ఆరు నుంచి 59 నెలల మధ్య ఉన్న చిన్నారుల్లో, 15 ఏళ్ల నుంచి 49 ఏళ్ల మధ్య ఉన్న కౌమరదశ బాలికలు, మహిళల్లో రక్తహీనతను సంవత్సరానికి మూడు శాతం తగ్గించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

ఒక్కరే మాస్టారు

(మొదటిపేజీ తరువాయి)

40 మంది ఉండాలి. తరగతి గదుల్లో కనీసం కూర్చోవడానికి బెంచీలు లేవు. వర్షం పడితే తరగతి గదులు కారిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. కళాశాలలో కనీస సదుపాయాలు, బాత్‌రూమ్‌లు, ప్రహరీ లేదని, ఇవే కాక మరెన్నో సమస్యలతో సతమతమవుతున్నట్లు విద్యార్థినులు వాపోతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వడమే తప్ప ఎలాంటి ప్రయోజన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణ చర్యలు తీసుకోవాలి: ఏపీపీసీసీ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

కళాశాలను సందర్శించిన ఏపీపీసీసీ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి అక్కడ పరిస్థితులను చూసి విస్మయం వ్యక్తం చేశారు. తక్షణ చర్యలు తీసుకోకుంటే ఉద్యమబాట పట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆమె వెంట అరకువేలి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయి మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి శెట్టి భగత్ రాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుంజీడి సుబ్బారావు, కొర్ర పోతురాజు, జంపరంగి వెంకట బాబు, మాదల పండు ఉన్నారు.

ఆ చట్టం మీకు వర్తించదు : సుప్రీం

న్యూఢిల్లీ : ఒక మతంలోని రెండు వర్గాల ఘర్షణకు ప్రార్థనా స్థలాల చట్టం-1991 వర్తించదని సుప్రీంకోర్టు శనివారం తెలిపింది. ప్రార్థనా స్థలాల మార్పిడిపై జైన్ మతానికి చెందిన రెండు వర్గాల మధ్య వివాదంపై పిటిషన్‌ను తిరస్కరించింది. ప్రార్థనా స్థలాల చట్టాన్ని అమలు చేయాలని, ప్రార్థనా స్థలాల మార్పిడిని అరికట్టాలని కోరుతూ శ్వేతాంబెర్ మూర్తిపూజక్ జైనులు, తపాగచ్ మొహ్జిత్ సముడే అనుచరులు శరద్ జవేరీ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా ధర్మాసనం పరిశీలించింది. తపాగచ్; శ్వేతాంబర్ మూర్తిపూజక్ జైనుల మధ్య వివాదం పరిష్కారానికి ఈ చట్టం అమలు చేయడం కుదరదని తేల్చిచెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం పిటిషన్‌లోని సవరణలు, ప్రతిపక్ష కౌంటర్ అఫిడవిట్‌ల ఆధారంగా పరిష్కారం జరగదని పేర్కొంది. సివిల్ ప్రొసీజర్ కోడ్ -1908లోని సెక్షన్ 92 కింద దావా రూపంలో తగినన్ని పరిష్కారాలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం పిటిషన్‌ను స్వీకరించడం లేదని పేర్కొంది. పిటిషనర్లకు చట్టప్రకారం ఉన్న ఇతర అవకాశాల అన్వేషణకు స్వేచ్ఛ కల్పించింది. పిటిషనర్ల హక్కులు లేదా చట్టంలో వారి అర్హతపై అభిప్రాయాన్ని వ్యక్తంచేసేలా తమ ఉత్తర్వుల్లో ఏమీ లేదని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది.

పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం

హెడ్మాస్టర్ సహా పది మంది సస్పెన్షన్

హత్రాస్ : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదిలో నిద్రిస్తున్న చిన్నారిని గమనించకుండా గది తలుపులు మూసి వేసి వెళ్లి పోయిన అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లా, నాగ్లా ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న ప్రేమ్ ఆకాశ్ అనే ఆరేళ్ల విద్యార్థి తరగతి గదిలోనే నిద్ర పోయాడు. ఈ విషయాన్ని గమనించకుండా ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాఠశాలను మూసి వెళ్లిపోయారు. సాయంత్రం ఐదు గంటల తరువాత నిద్ర నుంచి మేల్కొన్న చిన్నారి గది తలుపులు మూసి ఉండడంతో గట్టిగా ఏడ్వడం మొదలు పెట్టడంతో పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న బాలుడి తండ్రి పాఠశాలకువచ్చి గది తలుపులు పగులగొట్టి చిన్నారిని బయటకు తీసుకువచ్చారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో విచారణకు ఆదేశించారు. ఘటనకు పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తేలడంతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సహా మొత్తం 10 మందిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు విద్యాశాఖ అధికారి సందీప్ సింగ్ తెలిపారు. ఇందులో నలుగురికి ఒక నెల జీతం కూడా నిలిపివేయాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు.

యాసిన్ మాలిక్‌కు జైలులోనే చికిత్స

న్యూఢిల్లీ: ఉగ్రవాదానికి నిధులు సమకూర్చిన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న కాశ్మీరీ వేర్పాటువాద నేత యాసిన్ మాలిక్‌ను తీహార్ జైలులోని మెడికల్ ఇన్వెస్టిగేషన్ సెల్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. నిషేధిత జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ అధ్యక్షుడు రుబయ్యా సయీద్‌ను విచారించే జమ్మూ కోర్టులో భౌతికంగా హాజరవడానికి తనను అనుమతించాలని చేసిన విజ్ఞప్తిపై కేంద్రం స్పందించకపోవ డంతో ఈ నెల 22 మాలిక్ జైలులో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నేప థ్యంలో మంగళవారం బీపీ లెవల్స్‌లో పెరుగుతుండడంతో జైలు అధికారులు ఢిల్లీ లోని ఆర్ఎంఎల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ముందంజలో ట్రస్

లండన్: బ్రిటన్ ప్రధాని పదవికి పోటీపడుతున్న రిషి సునాక్, లిజ్ ట్రస్‌ల మధ్య పోరు చరమాంకానికి చేరుకుంది. వచ్చే వారం నుంచి పార్టీ ఓటర్లకు బ్యాలెట్‌పత్రాలు పంపిణీకానున్నాయి. ప్రధాని పదవికి బోరిస్ జాన్సన్ రాజీనామా చేయడంతో ఆయన క్యాబినెట్‌లో మంత్రులుగా పని చేసిన రిషి సునాక్, లిజ్ ట్రస్ ప్రధాన పోటీదారులుగా నిలిచారు. తొలుత రిషి సునాక్, లిజ్ ట్రస్‌ల మధ్య విజయావకాశాలు 60-40 గా నిలిచాయి. కానీ, క్రమంగా పరిస్థితులు మారుతున్నాయి. అధికార కన్జర్వేటివ్ పార్టీ సభ్యుల్లో 90 శాతం మంది లిజ్ ట్రస్‌ను విశ్వసిస్తున్నారని స్మార్కెట్ అనే సంస్థ అంచనాలో తేలింది. ఇద్దరు ప్రధాన ప్రత్యర్థులు పాల్గొన్న టీవీ చానెళ్ల చర్చాగోష్టుల్లో రిషి సునాక్‌ను లిజ్ ట్రస్ వెనక్కు నెట్టేశారని తెలుస్తున్నది. కన్జర్వేటివ్ పార్టీ సభ్యులను ఆకట్టుకునే రీతిలో లిజ్ ట్రస్ ప్రసంగాలు ఉన్నాయని సమాచారం. కన్జర్వేటివ్ పార్టీ ఎంపీల్లో మెజారిటీ సభ్యుల విశ్వాసాన్ని చూరగొన్న రిషి సునాక్.. పార్టీ సభ్యుల మదిని గెలుచుకోవడంలో వెనుకబడినట్లు స్మార్కెట్స్ పొలిటికల్ మార్కెట్స్ అధిపతి మాథ్యూ షాడిక్ చెప్పారు. కేవలం 10 శాతం మంది మద్దతు మాత్రమే రిషి సునాక్‌కు లభిస్తుందన్నారు. సుమారు 1.75 లక్షల మంది పార్టీ సభ్యులకు ఓటు హక్కు ఉందని తెలుస్తున్నది. వీరిలో మెజారిటీ సభ్యుల మద్దతు లభించిన వారే బ్రిటన్ తదుపరి ప్రధాని అవుతారు. సెప్టెంబరు 2వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఓటు వేసిన బ్యాలెట్లను సమర్పించవలసి ఉంటుంది. సెప్టెంబరు 5న ఫలితాలు వెలువడతాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో జరిగిన టీవీ చానెళ్ల చర్చాగోష్టుల్లో పాల్గొన్న రిషి సునాక్, లిజ్ ట్రస్.. సాధారణ సభ్యుల మద్దతు సంపాదించుకునేందుకు ఆరు వారాలు దేశమంతా పర్యటిస్తారు. వచ్చేవారం బ్యాలెట్ల పంపిణీ ప్రారంభం అవుతుంది. సెప్టెంబర్ రెండో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు కన్జర్వేటివ్ పార్టీ సభ్యులు తమ బ్యాలెట్ పత్రాలను సమర్పించాల్సి ఉంది. సెప్టెంబర్ ఐదో తేదీన తుది ఫలితాలు వెలువడతాయి.

పదవీవిరమణ యోచనలో పోప్ ఫ్రాన్సిస్

వాటికన్ సిటీ: క్యాథలిక్ మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్ (85) పదవినుంచి విరమించుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వయసు మీద పడడంతో ప్రయాణించలేకపోతున్నానని, మోకాలి నొప్పులు ఇబ్బందిపెడుతున్నాయని, కాస్త తగ్గాలన్న సంకేతాన్ని అందిస్తున్నాయని పోప్ ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. 85 ఏళ్ల పోప్ ఫ్రాన్సిస్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాజీనామా చేయాలన్న ఆలోచన లేదనీ కానీ దానికి దారులు తెరిచే ఉన్నాయన్నారు. పోప్ పదవి నుంచి తప్పుకోవడంలో ఎటువంటి తప్పులేదని ఫ్రాన్సిస్ అన్నారు. రిటైర్మెంట్ ఆలోచన లేకున్నా.. తన పనుల్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజల గడపకు న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

అమిత విశ్వాసం ఉందని మోదీ అన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం అందుబాటులోకి రాగలిగే యంత్రాంగం అవసరమని సీజేఐ రమణ సూచించారు. 'న్యాయం : సామాజిక, ఆర్థిక, రాజకీయ - ఇలా ఏ రూపంలోనైనా న్యాయం అన్నది ప్రతి భారతీయునికి మన పీఠిక హామీనిచ్చింది. కానీ నేటి పరిస్థితుల్లో న్యాయం కోసం న్యాయ స్థానాలను ఆశ్రయించగలిగే వారి సంఖ్య చాలా తక్కువ. మరెందరికో న్యాయం దక్కే పరిస్థితులే ఉండటం లేదు. సమాజంలో అసమానతలను తొలగించే ఉద్దేశంతోనే ఆధునిక భారతం నిర్మాణం జరిగింది. ప్రతి ఒక్కరికి భాగస్వామ్యం కల్పించడమే ప్రాజెక్టు ప్రజాస్వామ్యం. సామాజిక స్వేచ్ఛ లేకపోతే ఇది సాధ్యం కాదు. సామాజిక స్వేచ్ఛకు న్యాయం అందుబాటులో ఉండటం అన్నది ఒక అస్త్రం ' అని సీజేఐ అన్నారు. విడుదలకు అర్హులైన విచారణ ఖైదీలకు సత్వరమే న్యాయ సాయం అందించే దిశగా చర్యలు అవసరమన్న ప్రధాని మాటలతో ఏకీభవించారు. విచారణ ఖైదీలకు విముక్తి కల్పించే దిశగా భాగస్వాములతో కలిసి జాతీయ న్యాయ సేవల యంత్రాంగం (ఎన్ఏఎల్ఎస్ఏ) చేస్తున్న కృషి అభినందనీయమని మోదీ అన్నారు. సగటున 29 ఏళ్ల వయస్సుగల కార్మికశక్తి అత్యధికంగా ఉన్న ప్రపంచ దేశాల్లో భారత్ ఒకటని సీజేఐ రమణ చెప్పారు. నైపుణ్యం ఉన్న కార్మికులు మొత్తం కార్మికశక్తిలో మూడుశాతం కాగా యువతలో నైపుణ్యాన్ని మరింత పెంపొందించాలని తద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఆమేరకు ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు వీలు ఉంటుందని సూచించారు. న్యాయ వ్యవస్థకు జిల్లా న్యాయ వ్యవస్థ వెన్నెముక అన్నారు. ప్రజలను చేరుకునేందుకు ఇదే మొదటి మాధ్యమని, దీనిని బలపర్చడం ప్రస్తుతం అత్యవసరమని నొక్కిచెప్పారు. దేశ న్యాయ వ్యవస్థపై ప్రజల్లో అభిప్రాయం ఎలా ఏర్పడుతుందనేది జిల్లా స్థాయి న్యాయ వ్యవస్థ మీదే ఆధారపడి ఉందని చెప్పారు. భారత్‌లో న్యాయ సేవల ఉద్యమానికి చోదకశక్తిగా జిల్లా న్యాయవ్యవస్థ ఉందని సీజేఐ అన్నారు. లోక్ ఆదాలత్ వంటి ప్రత్యామ్నాయ ఏడీఆర్ యంత్రాంగాలను పటిష్టపర్చుకోవడం అవసరమని జస్టిస్ రమణ నొక్కిచెప్పారు. ప్రధాని మాట్లాడుతూ, విచారణ ఖైదీలకు విముక్తి కల్పించేందుకుగాను విచారణ ఖైదీల సమీక్షా కమిటీల చైర్‌పర్సన్‌లు జిల్లా జడ్జీలుగా వ్యవహరించవచ్చు అని అన్నారు. విచారణ ఖైదీల విడుదల కోసం ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినందుకుగాను ఎన్ఏఎల్ఎస్‌ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మరింత మంది న్యాయవాదులను ప్రోత్సహించాలని బార్ కౌన్సిల్‌ను కోరారు. జుడీషియరీ వ్యవస్థ తరహాలోనే న్యాయం అందించడం కూడా ముఖ్యమని మోదీ చెప్పారు. ఐటీ, ఫిన్‌టెక్‌లో భారత్ నాయకత్వాన్ని ప్రస్తావించారు. జ్యుడిషియరీ కార్యకలాపాలకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మరింత శక్తినిచ్చేందుకు ఇంతకంటే మెరుగైన సమయం లేదన్నారు. ఈ-కోర్టుల మిషన్ కింద దేశంలో వర్చువల్ కోర్టులు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి నేరాల కోసం కోర్టులు 24 గంటలు పనిచేస్తున్నాయని, ప్రజల సౌకర్యార్థం కోర్టుల్లో వీడియో కాన్ఫరెన్సింగ్ వసతుల విస్తరణ జరుగుతోందని ప్రధాని చెప్పారు. దేశంలో ఇప్పటివరకు కోటికిపైగా కేసులు వీడియో కాన్ఫరెన్స్‌లో విచారించినట్లు తెలిపారు.

21వ శతాబ్దపు వాస్తవిక పరిస్థితుల స్థాయికి చేరుకున్నామన్నారు. రాజ్యాంగబద్ధ హక్కులు, విధుల గురించి పౌరులకు తెలియాలని, రాజ్యాంగంపై అవగాహన కల్పనలో టెక్నాలజీ పాత్ర కీలకమని మోదీ చెప్పారు. ఈ సమావేశాన్ని ఎన్ఏఎల్ఎస్ఏ నిర్వహించింది. సీజేఐ రమణతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు యూయూ లలిత్, డీవై చంద్రచూడ్, న్యాయమంత్రి కిరణ్ రిజిజూ, కేంద్రమంత్రి ఎస్పీఎస్ బాఘెల్, ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులు, జిల్లా, -రాష్ట్ర న్యాయ సేవల యంత్రాంగాల ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్‌లు పాల్గొన్నారు. కాగా, 2020లో ఎన్‌సీబీ విడుదల చేసిన భారత్‌లో జైళ్ల గణాంకాల నివేదిక ప్రకారం మొత్తం ఖైదీలు 4,88,511 మంది కాగా వీరిలో 76శాతం అంటే 3,71,848 మంది విచారణ ఖైదీలని తెలుస్తోంది.

రూ.110 కోట్ల 'కార్వీ' ఆస్తులు అటాచ్

(మొదటిపేజీ తరువాయి)

జనవరిలో అరెస్టు కాగా వీరిద్దరూ బెయిల్‌పై విడుదల అయ్యారు. అనేక డొల్ల కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలను వాడి ఒక క్లిష్టమైన ఆర్థిక లావాదేవీల ఉచ్చును కార్వీ అల్లిందని ఈడీ ఆరోపించింది. గ్రూప్ కంపెనీలకు పెట్టుబడులు/షేర్ క్యాపిటల్/స్వల్పకాలిక అడ్వాన్స్‌లు/రుణాల రూపంలో పెద్ద మొత్తంలో నేరాదాయం రాగా దానిని 'పెట్టుబడి'గా మార్చిందని పేర్కొంది. తన కుమారులు రజత్, అధిరాజ్‌లకు ఆర్థిక ప్రయోజనాలను గ్రూపు కంపెనీల ద్వారా అందేలా ఏర్పాట్లను పార్థసారథి చేసినట్లు ఈడీ వెల్లడించింది. ఆ డబ్బు వేతనాలు, ఇంటి ఖర్చుల రీయింబర్స్‌మెంట్ రూపేణ కుటుంబ సభ్యుల చేతుల్లోకి వెళ్లడం ద్వారా తెల్లధనమైందని పేర్కొంది. కేడీఎంఎస్ఎల్ ఎండీ వి.మహేశ్, కార్వీ గ్రూపు సీనియర్ అధికారి, కీలక పరిపాలన సభ్యుడు; పార్థసారథికి సన్నిహితుడని, మనీలాండరింగ్‌లో క్రియాశీల పాత్ర పోషించారని ఈడీ ప్రకటన పేర్కొంది. లక్షలాది మంది క్లయింట్లతో దేశంలోనే దిగ్గజ స్టాక్ బ్రోకర్లలో ఒకటిగా వెలుగొందిన కేఎస్‌బీఎల్ గుట్టు 2019లో ఎన్ఎస్ఈ పర్యవేక్షణ క్రమంలో రట్టు అయింది. ఈ కుంభకోణం వెలుగు చూసింది. కేఎస్‌బీఎల్ డీపీ ఖాతాను బహిర్గతం చేయలేదని, క్లయింట్ల సెక్యూరిటీలను చూపి తీసుకున్న డబ్బును స్టాక్ బ్రోకర్ క్లయింట్ ఖాతాలో జమ చేయలేదని, ఆరు సొంత ఖాతాలకు మళ్లించిందని ఈడీ ఇంతకుముందు వెల్లడించింది. నిబంధనలకు విరుద్ధంగా క్లయింట్ షేర్లను వాడుకొని వేర్వేరు కార్పొరేట్ బ్యాంకుల నుంచి ఎనిమిదేళ్లలో రూ.3,520 కోట్లను రుణంగా ఈకంపెనీ పొందిందని; ఆ డబ్బును డొల్ల కంపెనీలకు మళ్లించిందని పేర్కొంది. విషయం సెబీ దృష్టికి వెళ్లగా ఈ సంస్థ ట్రేడింగ్‌పై నిషేధాన్ని విధించిందని తెలిపింది. పార్థసారథి రుణాలు చెల్లించకపోవడంతో బ్యాంకుల ప్రతినిధులు వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదులు చేశారని వెల్లడించింది. తాజా చర్యల్లో భాగంగా రూ.110.70 కోట్ల ఆస్తులను ఆటాచ్ చేసినట్టు ఈడీ తెలిపింది.

శభాష్ సర్గార్

(మొదటిపేజీ తరువాయి)

టాప్‌లో నిలిచినప్పటికీ.. మలేషియా వెయిట్ లిఫ్టర్ అనిఖ్ కస్దాన్ మహదేవ్‌ను అధిగమించి గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నాడు. క్లీన్ అండ్ జర్క్ విభాగంలో చివరి ప్రయత్నంలో 142 కేజీల బరువెత్తి రికార్డు సృష్టించిన అనిఖ్.. స్నాచ్ విభాగంలో 107 కేజీలే ఎత్తాడు. ఓవరాల్‌గా 249 కేజీలు ఎత్తి టాప్‌లో నిలిచాడు. శ్రీలంకకు చెందిన దిలంక ఇసురు 225 కేజీలతో మూడో స్థానంలో నిలిచాడు. స్నాచ్ విభాగంలో 105 కేజీలు ఎత్తిన శ్రీలంక ప్లేయర్.. క్లీన్ అండర్ జర్క్‌లో 120 కేజీలు ఎత్తాడు.

అదరగొట్టిన శ్రీహరి

భారత స్టార్ స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ కామన్‌వెల్త్ గేమ్స్‌లో అదరగొట్టాడు. పురుషుల స్విమ్మింగ్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో తొలిసారి ఫైనల్లో ప్రవేశించాడు. భారత కాలమాన ప్రకారం శనివారం తెల్లవారుజామున జరిగిన 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్ సెమీఫైనల్ హీట్-2లో రేసును 54.55 సెకన్లలో పూర్తి చేసిన నటరాజ్ నాలుగో స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా ఏడో ప్లేయర్‌గా ఫైనల్లో అడుగుపెట్టిన నటరాజ్ పతకంపై ఆశలు పెంచాడు. ఇక ఫైనల్ రేసు ఆదివారం జరగనుంది. బ్యాడ్మింటన్‌లో ఇప్పటికే పాక్‌ను చిత్తు చేసి ఊపు మీదున్న భారత్ గ్రూప్-ఏ, లంకపైనా ఆధిక్యం కొనసాగిస్తోంది. ఇక పురుషుల మారథాన్ ఫైనల్‌లో భారత్ అథ్లెట్ రావత్ 17 స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

భారత్ ఖాతాలో మరో పతకం..

బర్మింగ్‌హామ్ వేదికగా జరుగుతున్న కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ సత్తా చాటుతుంది. తాజాగా 61 కేజీల (పురుషుల) విభాగంలో గురురాజ పుజారి కాంస్యం నెగ్గాడు. గురురాజ మొత్తం 269 కేజీల బరువును (స్నాచ్‌లో 118 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 153 కేజీలు) ఎత్తి మూడో స్థానంలో నిలువగా.. మలేషియాకు చెందిన అజ్నిల్ బిన్ బిడిన్ మహ్మద్ 285 కేజీలు (127, 158) ఎత్తి స్వర్ణ పతకాన్ని.. పపువా న్యూ గినియాకు చెందిన మోరియా బారు 273 కేజీలు (121, 152) ఎత్తి రజతం సాధించారు. కాగా, గురురాజకు కామన్‌వెల్త్ క్రీడల్లో ఇది వరుసగా రెండో పతకం కావడం విశేషం. అతను 2018 గోల్డ్ కోస్ట్ క్రీడల్లో 56 కేజీల విభాగంలో రజత పతకం సాధించాడు.

ఎవరీ సంకేత్..

భారత్‌కు తొలి పతకాన్ని అందించిన సంకేత్ మహదేవ్ నిరుపేద కుటుంబం నుంచి వచ్చాడు. సరైన ఉద్యోగం లేక తండ్రికి చెందిన ఓ చిన్న పాన్‌షాప్, ఫుడ్ స్టాల్‌ను నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఓవైపు తనకు ఇష్టమైన వెయిట్ లిఫ్టింగ్‌ను సాధన చేస్తూనే మరోవైపు పాన్ షాప్‌తో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మహారాష్ట్రలోని సంగ్లీకి చెందిన సంకేత్ మహదేవ్.. పాన్‌లు కట్టిన చేతులతోనే భారత్‌కు తొలి పతకాన్ని అందించాడు. కామెన్వెల్త్ గేమ్స్‌లో సాధించిన రజత పతకమే అతని కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన.

టోర్నీకి ముందే...

2021 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో తీవ్రంగా నిరాశపర్చిన సంకేత్ అద్భుతంగా పుంజుకున్నాడు. స్నాచ్ విభాగంలో అందరికన్నా ఎక్కువ బరువెత్తి అగ్రస్థానంలో నిలిచాడు. వారు కేజీల వ్యత్యాసంతో నిలిచిన మహదేవ్ స్వర్ణపతకం గెలిచేలా కనిపించాడు. కానీ క్లీన్ అండ్ జర్క్‌లో విఫలమవడంతో రెండో స్థానంలో నిలిచిపోయాడు. ఈ విజయానికి ముందు మీడియాతో మాట్లాడిన సర్గార్.. ఈ టోర్నీ తర్వాత తనకు గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఒలింపిక్ మెడల్ సాధించడమే...

'నేను ఈ పోటీల్లో బంగారు పతకం గెలిస్తే నాకు తగిన గుర్తింపు లభిస్తుంది. నా తండ్రికి ఆర్థిక భరోసా ఇవ్వడం నా లక్ష్యం. అలాగే నా కోసం ఎంతో చేసిన ఆయనకు విజయం ద్వారా కృతజ్ఞతలు తెలపడం నా కల. పారిస్ 2024 ఒలింపిక్స్ ఆడటమే నా లక్ష్యం. దాని కోసం నేను 61 కేజీల విభాగానికి మారుతా. ఇది చాలా కష్టం. కానీ ఇంకా రెండేళ్ల సమయం ఉంది. కాబట్టి ఆ దిశగా సన్నద్ధమవుతా. క్యాష్ అవార్డ్స్ వచ్చినా.. ఇంకే బహుమానం అందినా నా లక్ష్యం అయితే మారదు. ఒలింపిక్స్‌లో దేశం తరపున పతకం సాధించడమే నా ప్రధాన లక్ష్యం'అని సంకేత్ మహదేవ్ చెప్పుకొచ్చాడు.

ముంబైలో డబ్బుండదు

(మొదటిపేజీ తరువాయి)

ఉండదని, ముంబై ఆర్థిక రాజధానిగా ఉండదని నేను ఇక్కడి ప్రజలకు చెబుతున్నాను' అని అన్నారు. ముంబైని దేశ ఆర్థిక రాజధానిగా మార్చడంలో రాజస్థానీ-మార్వాడీ, గుజరాతీ సమాజం సహకారాన్ని కోశ్యారీ కొనియాడినట్లు రాజ్ భవన్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. రాజస్థానీ-మార్వాడీలు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు నేపాల్, మారిషస్ వంటి దేశాల్లో నివసిస్తున్నారని గవర్నర్ చెప్పారు. 'ఈ సంఘంలోని సభ్యులు ఎక్కడికి వెళ్లినా వారు వ్యాపారం చేయడమే కాకుండా పాఠశాలలు, ఆసుపత్రులు సృష్టించడం ద్వారా దాతృత్వ చర్యలు కూడా చేస్తారు' అని అన్నారు. తన వ్యాఖ్యలు వివాదాన్ని రేకెత్తించడంతో కోశ్యారీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో వాణిజ్యం, పరిశ్రమలకు గుజరాతీ, రాజస్థానీ వర్గాల సహకారం గురించి మాత్రమే తాను మాట్లాడుతున్నానని అన్నారు. 'అలా చేయడం వల్ల, మరాఠీ మాట్లాడే ప్రజలను కించపరిచే ఉద్దేశం నాకు లేదు. నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు' అని ఆయన తెలిపారు. మహోన్నతమైన మహారాష్ట్రలో గవర్నర్‌గా పని చేయడం గర్వంగా ఉందని కోశ్యారీ అన్నారు. 'ముంబై మహారాష్ట్రకు గర్వకారణం. దేశ ఆర్థిక రాజధాని కూడా. నేను కూడా తక్కువ సమయంలో మరాఠీ నేర్చుకోవాలని ప్రయత్నించాను' అని అన్నారు. మరాఠీ పారిశ్రామికవేత్తలు రాష్ట్రం, దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారని పేర్కొంటూ మరాఠీ ప్రజలను కించపరిచే ప్రశ్నే లేదని చెప్పారు. ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో చూడటం అలవాటుగా మారిందని, ఈ వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 'ఒక సమాజాన్ని పొగడడం అంటే మరో వర్గాన్ని అవమానించడం కాదు. రాజకీయ పార్టీలు అనవసర వివాదాలు సృష్టించకూడదు. మహారాష్ట్ర, మరాఠీలను నేనెప్పుడూ అవమానించను' అని ఆయన అన్నారు. కాగా గవర్నర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అతుల్ లోంధే మండిపడ్డారు. రాష్ట్రం పట్ల ఆయన తనకు ఉన్న ద్వేషాన్ని చాటారని ఆరోపించారు. అలాగే గవర్నర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ), శివసేన కూడా గవర్నర్‌పై విరుచుకుపడ్డాయి. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు ఆత్మగౌరవం ఉంటే గవర్నర్ రాజీనామా డిమాండ్ చేయాలని శివసేన నేత సంజయ్ రౌత్ అన్నారు. షిండే నేతృత్వంలోని శివసేన అధికార ప్రతినిధి దీపక్ కేసర్కర్ కూడా గవర్నర్‌పై విమర్శలు గుప్పించారు.

నేటితో ముగియనున్న ఐటీ రిటర్న్ గడువు

4.52 కోట్ల ఐటీఆర్‌లు దాఖలు

న్యూఢిల్లీ : 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఐటీ రిటర్న్ దాఖలు చేయడానికి ఇచ్చిన గడువు ఆదివారంతో ముగియనున్న నేపథ్యంలో ఇప్పటి వరకూ 4.52 కోట్లకు పైగా ఐటీ రిటర్న్ దాఖలైనట్టు ఆదాయపు పన్నుశాఖ తెలిపింది. జూలై 29న ఒక్క రోజే 43 లక్షల మందికి పైగా ఐటీ రిటర్న్‌ను ఫైల్ చేసినట్టు శనివారం ఆదాయపు పన్ను శాఖ అధికారికంగా ట్వీట్ చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూలై 29 నాటికి 4.52 కోట్ల ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలు అయ్యాయని...రిటర్న్ దాఖలు చేయదానికి జూలై 31 వరకూ గడువు ఉందని పేర్కొంది. ఆదాయ పన్నుకు సంబంధించిన ఫైలింగులను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ విభాగాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఐటీ రిటర్న్ కోసం ఏర్పాటు చేసిన పోర్టల్‌లో వార్ రూమ్ , సోషల్ మీడియాలో సాంకేతిక నిపుణులతో కూడిన బృందం 24 గంటలు సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఫైలింగ్‌కు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, పన్ను చెల్లింపుదారులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్నట్టు తెలిపారు.

పారా హుషార్...!

(మొదటిపేజీ తరువాయి)

ఆ సంఖ్య 1,158 వద్దే ఆగిపోయింది. వారు కూడా స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధి దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బార్ లైసెన్స్ కోసం ప్రభుత్వానికి చెల్లించే ఫీజు నాన్ రిఫండబుల్ కాగా, దానితో పాటు స్థానిక ఎమ్మెల్యేకు జనాభా ఆధారంగా 10 నుంచి 25 లక్షలు చెల్లిస్తేనే వేలంలో సజావుగా వారికి పోటీ లేకుండా బార్ లైసెన్స్ దక్కే పరిస్థితి కల్పిస్తారు. తమను కాదని దరఖాస్తు చేసుకున్నవారికి బార్లు రావని అధికార పార్టీ నేతలు బహిరంగంగానే హెచ్చరించడంతో అనేక దశాబ్దాలుగా వ్యాపారం చేసేవారు వారికి అనుకూలంగా వ్యవహరించగా, వారికి కప్పం చెల్లించలేని చాలామంది దరఖాస్తుదారులు వెనకడుగు వేశారు. బార్ల కోసం ముందుగా నమోదు చేసుకున్నవారి సంఖ్యతో పోలిస్తే దరఖాస్తు రుసుము చెల్లించిన వారి సంఖ్య అనూహ్యంగా పడిపోవడమే ఇందుకు నిదర్శనం. అధికార పార్టీ నేతలు పట్టించుకోని ప్రాంతాల్లో మాత్రమే వేలంలో బిడ్డర్లు పోటీ పడ్డారు. శనివారం జోన్-1, జోన్-4 అయిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో బిడ్లను తెరిచారు.

రాయలసీమలో అధికార పార్టీ నేతలకు చెందినవారే పోటీపడడంతో భారీ మొత్తాలకు బిడ్లు దాఖలయ్యాయి. తిరుపతిలోని 16 బార్లకు ఆన్‌లైన్ ద్వారా వేలం నిర్వహించారు. తిరుపతిలో అత్యధికంగా రూ.1.59 కోట్లు, అత్యల్పంగా రూ.1.49 కోట్ల ధర పలికింది. అనంతపురంలోని ఓ బార్ కోసం రూ.1.09 కోట్లతో బిడ్ దాఖలు చేశారు. కడప జిల్లాలోని 27 బార్లకు ఈ వేలం నిర్వహించారు. కడపలోని ఓ బార్ కోసం అత్యధికంగా రూ.1.71 కోట్లకు, ప్రొద్దుటూరులోని ఓ బార్‌కు రూ.1.30 కోట్లతో బిడ్ దాఖలయింది. ఇక ఉత్తరాంధ్ర జిల్లాల్లో మద్యం సిండికేట్ల హవానే కొనసాగింది. దీంతో చాలా తక్కువ మొత్తాలకు బిడ్లు దాఖలయ్యాయి. అనంతపురం లాంటి వెనుకబడ్డ జిల్లాలో కూడా ఒక్కొక్క బార్ కోటి రూపాయలకు పైగా వేలం ధర పలకగా, విశాఖ లాంటి మహానగరంలో గరిష్ఠంగా రూ.60 లక్షలకు బార్లు దక్కించుకోవడం అధికార పార్టీ నేతలు ఏవిధంగా చక్రం తిప్పారో స్పష్టమవుతోంది.

విచిత్రమేమిటంటే విశాఖ నగరంలో మొత్తం 128 బార్లకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించగా 120 బార్లకు మాత్రమే దరఖాస్తులు రావడం మరో విశేషం. దరఖాస్తులు వచ్చిన వాటిలో 119 బార్ లైసెన్స్‌లకు అధికారులు ఆమోదం తెలిపారు. ఇక ఆదివారం కోస్తా జిల్లాల్లో జరుగుతున్న వేలం ప్రక్రియకు కూడా అధికార పార్టీ నేతలు ఇప్పటికే దరఖాస్తుదారులను సిండికేట్ చేశారు. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో 110 బార్‌లుండగా, కేవలం అదే సంఖ్యలో దరఖాస్తు చేయడం సిండికేట్ల ప్రభావాన్ని తెలియజేస్తోంది.

అంబానీ, అదానీలకు మోదీ ఊడిగం

పోరాట కమిటీ ప్రతినిధుల విమర్శ

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: దేశ సంపదను అంబానీ, అదానీలకు కట్టబెట్టేందుకు మోదీ తాపత్రయపడుతున్నారని విశాఖ ఉక్కు పోరాట కమిటీ ప్రతినిధులు విమర్శించారు. విశాఖ ఉక్కు పోరాట కమిటీ అధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 534వ రోజుకు చేరుకున్నాయి. సీఓ & సీసీపీ విభాగం కార్మికులు, పోరాట కమిటీ ప్రతినిధులు డీ ఆదినారాయణ, వై మస్తాన్‌ప్ప, వి.శ్రీనివాస్, బోసుబాబు, బి.కామేశ్వరరావు. డి. సంపూర్ణం, రామ్‌కుమార్ పాల్గొనగా పోరాట కమిటీ సభ్యుడు వరసాల మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశం భారీ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ప్రజలు సమస్యలపై నిత్యం పోరాటం చేస్తున్నారని, వైఫల్యాల పరంపర కొనసాగుతుందన్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలు వీరి చర్యలను వ్యతిరేకిస్తున్నా నరేంద్రమోదీ ప్రభుత్వం నీరో చక్రవర్తిలాగా వ్యవహరించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. దేశంలో ఉన్న వ్యవస్థలు మొత్తం గుజరాతీల కబంధహస్తాల్లో చిక్కుకున్నాయని, ఇద్దరు గుజరాతీలను ప్రపంచ సంపన్నుల జాబితాలో చేర్చడానికి అత్యంత ధనికులుగా అవతరింపజేయడానికి బీజేపీ పాలకులు దేశ సంపదలను కొల్లగొడుతున్నారు. ప్రజల ఆకాంక్షను, దేశ సంపదను ధారాదత్తం చేసే ప్రక్రియలు ఇప్పటికైనా ఆపకపోతే దేశంలో 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీలకు ఏ గతి పట్టిందో అదే గతి బీజేపీకి పడుతుందని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వెంటనే ఆపాలనీ, స్టీల్ ప్లాంట్‌ను బలహీనపరిచే చర్యలను ప్రభుత్వం, యాజమాన్యం విరమించుకోవాలని, సొంత గనులు కేటాయించాలని, మిగిలి ఉన్న నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సీఓసీసీపీ విభాగానికి చెందిన నాయకులు బాబురావు, తాంధ్ర కనకారావు, ఎం నర్సింగ్‌రావు, శ్రీనివాసరావు, మొహిద్దిన్, నరేష్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు

వైద్య సదుపాయాల్లో రాజీ లేదు: రజని

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వైద్య సదుపాయాల్లో ఎలాంటి రాజీ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్యాశాఖ మంత్రి, విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జ్ విడదల రజని తెలిపారు. స్థానిక కేజీహెచ్లో రూ.68 లక్షల వ్యయంతో అత్యాధునిక వసతులతో నిర్మించిన మార్చురీ వార్డును శనివారం మంత్రి ప్రారంభించారు. ప్రతి గ్రామానికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, మండలానికి రెండు పీహెచ్‌సీలు, కొత్తగా సీహెచ్సీలు, ఏరియా ఆస్పత్రులు, డీహెచ్‌లు, ఏకంగా 16 మెడికల్ కళాశాలల నిర్మాణం, ఇలా ఎన్నో సంచలన సంస్కరణల దిశగా రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తోందని మంత్రి వివరించారు. విశాఖపట్టణం, గుంటూరు, కర్నూలు పట్టణాల్లో అత్యాధునిక కేన్సర్ వైద్య చికిత్సను ప్రజలకు ఉచితంగా అందించేందుకు కేన్సర్ కేర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కిడ్నీ రోగులకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించేందుకు శ్రీకాకుళం జిల్లా పలాసలో కిడ్నీ రీసెర్చ్ అండ్ డయాలసిస్ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఇలా ప్రతి రోగానికి ప్రభుత్వమే ఉచితంగా వైద్యం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేశ్ కుమార్, కె.జి.హెచ్ సూపరింటెండెంట్ డా.పి.మైథిలి, ఎ.ఎమ్.సి. ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, ఏపీఎమ్ఎస్ఐడీసీ ఈఈ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్య నిషేధమా... అదెప్పుడు చెప్పాం?

మంత్రి అమర్‌నాథ్ వింత వివరణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మద్యం పచ్చటి కాపురాల్లో చిచ్చు పెడుతోందని, మానవ సంబంధాలు మృగ్యమైపోతున్నాయని, అధికారంలోకి రాగానే మద్యాన్ని దశలవారీగా నిషేధిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో వివరించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు దశల్లో మద్యాన్ని నిషేధిస్తామని, కేవలం 5 స్టార్ హోటల్స్‌కే పరిమితం చేస్తామని తన ఎన్నికల ప్రణాళికలో పేర్కొంది. దీనిపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇచ్చిన వివరణ వింతగా ఉంది. మద్యపాన నిషేధంపై ప్రభుత్వం ఎందుకు మాట తప్పిందని విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విలేకరులు ప్రశ్నించారు. దీనికి స్పందించిన మంత్రి అసలు తమ పార్టీ మద్యనిషేధం అనే మాటే చెప్పలేదని తేల్చేశారు. మద్యనిషేధం అనేదే తమ పార్టీ మానిఫెస్టోలో లేదన్నారు. 'ఎన్నికల ప్రణాళికలో ఈ మాట చెప్పాం.. చెప్పిన మాట ప్రకారం చేయలేదేంటని ప్రశ్నించండి' అంటూ విలేకరులకు ఆయన సవాల్ విసిరారు. మద్యం ధరలు 5 స్టార్ హోటల్స్ కంటే ఎక్కువ పెడతాం.. ఎవరైనా ముట్టుకోవాలంటే షాక్ కొట్టే పరిస్థితికి తీసుకొస్తామని మాత్రమే మేనిఫెస్టోలో చెప్పామన్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా తమ పార్టీ మేనిఫెస్టో గోడలపై ఉంటుందని, కావాలంటే వెళ్లి చూసుకోవచ్చనడంతో విలేకరులంతా అవాక్కయ్యారు. అధికారంలో ఉన్న వైసీపీ మద్యనిషేధంపై ఇచ్చిన మాట తప్పిందని, ధరలు ఇష్టమొచ్చినరీతిలో పెంచేసి అమ్ముతున్నారంటూ ప్రతిపక్ష టీడీపీ, జనసేన మండిపడుతున్నాయి. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చినట్లు అమలు చేయకుండా ప్రభుత్వం మాట తప్పుదోందంటూ విమర్శలు గుప్పిస్తున్నాయి.

తక్షణం హామీలు నెరవేర్చండి

- లేనిపక్షంలో ప్రజలు ఫ్యాను రెక్కలు విరిచేస్తారు
- గుంతకల్లులో సీపీఐ భారీ ర్యాలీ

విశాలాంధ్ర-గుంతకల్లు: రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి ప్రభుత్వం పతనమవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీశ్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుజరపాలని కోరుతూ శనివారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యాన బీరప్ప గుడి సర్కిల్ నుంచి గాంధీ చౌక్ విగ్రహం వరకు మహా ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి డి.జగదీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ నాయకత్వం వహించారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి అధ్యక్షతన జరిగిన సభలో జగదీష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు దాటినా రాష్ట్రంలో ఎక్కడా కూడా హామీలు అమలు పరచలేదని అన్నారు. గుంతకల్ ఎమ్మెల్యే వై.వెంకట్రామి రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ఇంతవరకు పట్టించుకోలేదని చెప్పారు. తక్షణమే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈరోజు ఈ కార్యక్రమానికి ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కావడం హామీల అమలుపై చేసిన మొదటి హెచ్చరికగా గుర్తించాలని హెచ్చరించారు. ఫ్యాను తిరిగేందుకు ప్రజలు సహకరించారు రాబోయే రోజుల్లో ఫ్యాను రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శులు బి.మహేష్, రమేష్ బాబు, రూరల్ కార్యదర్శి రాము రాయల్, పట్టణ, రూరల్ సహాయ కార్యదర్శులు ఎస్ ఎం డి గౌస్, రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరయ్య, మండల కార్యదర్శి ఎనుముల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం

రేపు జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 1వ తేదీన అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించవలసిందిగా స్వచ్ఛభారత్ యూనియన్ గౌరవాధ్యక్షులు చలసాని రామారావు, అధ్యక్ష, కార్యదర్శులు జె.హనుమంత్, ఎన్.శ్రీరాములు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. స్వచ్ఛభారత్ కార్మికుల వేతనం రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ జారీ చేసిన జీవో 680 అమలు చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, సామాజిక చట్టంలో భాగంగా పని భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పారిశుధ్య పనులతో గ్రామ పంచాయతీ ప్రజలను రక్షించిన క్లాప్ మిత్రలకు తక్షణం రూ.20 వేలు విడుదల చేయాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా సమానపనికి సమాన వేతన చట్టం ప్రకారం పారిశుధ్య కార్మికులుగా గుర్తించి 18,000 రూపాయల వేతనం చెల్లించాలని తదితర సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ ఆందోళనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పింఛను ప్రతిపాదనలు వేగవంతం: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పదవీ విరమణ పింఛను ప్రతిపాదనలు మంజూరు సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో మరింత వేగవంతం, సులభతరమవుతాయని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ ఏపీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని రాష్ట్ర స్థానిక నిధుల ఆడిట్ రాష్ట్ర సంచాలకులు హరి ప్రకాష్ శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పాల్గొని చర్చించిన అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతమున్న సంప్రదాయ పింఛను ప్రతిపాదనల దరఖాస్తు 18 పేజీలను 4 పేజీలకు కుదించి, సరళీకరణ చేశారనీ, పింఛను ప్రతిపాదనలు ఇంటర్‌నెట్‌లో ప్రతి ఉద్యోగి తన లాగిన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు తదనంతరం వారి జీతం చెల్లింపు అధికారి సేవా పుస్తకం తనిఖీ చేసి చివరిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. పింఛను ప్రతిపాదనలు ఆధార్ లింక్ ద్వారా అత్యంత విశ్వసనీయత, గోప్యతగా ఉంటాయనీ, పింఛను దరఖాస్తు నాలుగు పేజీల్లో 70% సమాచారం ఆధార్ నుంచి, సీఎఫ్ఎంఎస్ నుంచి ఆటోమేటిక్‌గా తీసుకుంటుందని వివరించారు. పింఛను దరఖాస్తు ఇంటర్‌నెట్‌లో చేసిన వెంటనే ప్రతి స్టేజి దగ్గర సిటిజన్ చార్టర్ అమలు చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే ఎస్ఎంఎస్ అలర్ట్ పంపబడుతుందని వివరించారు. ప్రస్తుతం ఉన్నటు కర్నూలు జిల్లా, కృష్ణా జిల్లా స్థానిక నిధుల ఆడిట్ కార్యాలయాలు అవసరమైతే అన్ని జిల్లాలకు విస్తరిస్తారని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగి పదవీ విరమణ రోజే అన్ని రకాల పింఛను ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇంటర్‌నెట్ పింఛను ప్రతిపాదనలపై వచ్చే వారంలో సమగ్ర ఉత్తర్వులు ఇస్తారనీ, నెలలోపు మరో సమావేశం ఏర్పాటు చేస్తారని వివరించారు. అలాగే పింఛను ప్రతిపాదనలపై అందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారని, దీని సాఫ్ట్ కాపీని ఉపాధ్యాయ సంఘాలకు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అన్ని జిల్లాల ఆడిట్ అధికారులు, సీఎఫ్ఎంఎస్ అధికారులు, గుర్తింపు పొందిన ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర వర్క్ షాప్‌ను ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ బ్లాక్‌లో మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులు చర్చించి తీసుకున్న నిర్ణయాలను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి వెల్లడించారు. పాఠశాలలకు సంబంధించి 3,4,5 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేసే జీవో 117ను తక్షణమే రద్దు చేయాలని, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్న కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్‌ను రద్దు చేసి పాత పద్ధతిలోనే పీజీ అడ్మిషన్లు చేపట్టాలని, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కూడా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, ఇంకా ఇవ్వవలసిన జగనన్న విద్యా కానుక కిట్లను సత్వరమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యా హక్కు చట్ట ప్రకారం 25 శాతం సీట్లు పేదలకు ఉచితంగా ఇవ్వాలని, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నిధులను తక్షణమే మంజూరు చేయాలని అన్నారు. కాగా విద్యార్థి ఉద్యమాలపై ప్రభుత్వం పోలీసుల నిర్బంధకాండను ఖండిస్తూ ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛని కాపాడాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, నాడు-నేడు కింద సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని నిర్ణయించారు. ఆగస్టు 18, 19 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో హాస్టళ్లలో హాస్టల్ నిద్ర చేపట్టాలని, అదేవిధంగా ఏఐఎస్ఎఫ్ 87వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆగస్టు 12న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు శివారెడ్డి వివరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శశి కుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్, జిల్లా ఆఫీస్ బేరర్ ఓం రాజ్, వినయ్ కుమార్, నగర నాయకులు మానస, గ్రేస్, శివాని, మధు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంస్కరణలతో

నాణ్యమైన విద్యుత్

- ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కే విజయానంద్
- ఘనంగా 'ఉజ్వల భారత్- ఉజ్వల భవిష్యత్-పవర్ ఏ 2047'

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక నూతన సంస్కరణలు చేపట్టాయని ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కే విజయానంద్ తెలిపారు. శనివారం ఉదయం ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవం'లో భాగంగా 'ఉజ్వల భారత్ -ఉజ్వల భవిష్యత్తు- పవర్ ఏ 2047'' విద్యుత్ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం ఉన్న 18,800 మెగావాట్ల సామర్థ్యానికి అదనంగా మరొక 1600 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని 2022-23 లో ఏర్పాటు చేయనున్నట్టు విజయానంద్ తెలిపారు. పోలవరం, లోయర్ సీలేరుల్లో అదనంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పనులు జరుగుతున్నాయన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలకు 212 కోట్ల రూపాయలు ఖర్చుతో విద్యుత్ లైన్లు వేశామనీ, ఈ కాలనీల్లో 10,067 లేఅవుట్లలో 14.81 లక్షల గృహాలను విద్యుదీకరించడానికి 3,483 కోట్ల రూపాయల ఖర్చుతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ జ్యోతి యోజనలో భాగంగా రాష్ట్రంలో 478 ఆవాసాలను విద్యుదీకరించి 1.87 లక్షల విద్యుత్ లేని గృహాలకు విద్యుత్ కల్పించడం ద్వారా నూరు శాతం గృహ విద్యుదీకరణ సాధించినట్టు వెల్లడించారు. డీడీజీ పథకంలో భాగంగా 407 మారుమూల ప్రాంతాలకు, కొండ ప్రాంతాల గిరిజన ఆవాసాలకు సోలార్ పవర్ అందించామని వివరించారు. ఉజ్వల భారత్-ఉజ్వల భవిష్యత్ ద్వారా దేశంలో అన్ని గ్రామాలకు విద్యుత్ అందించినట్టు రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహరావు అన్నారు. దేశంలోనే తొలిసారిగా కృత్రిమమేధ, మెషిన్ లెర్నింగ్ సాంకేతికతను ఉపయోగించి ఇంధన డిమాండును ఒక రోజు ముందే అంచనా వేసే విధానాన్ని రూపొందించిందని ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బీ శ్రీధర్ తెలిపారు. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించడానికి ఏపీఈపీడీసీఎల్ పునరంకితమవుతుందని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కే సంతోషరావు వెల్లడించారు. అనంతరం ప్రధానమంత్రి కార్యాలయం నుంచి జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి క్రాంతి కుమార్ అనే గిరిజన యువకుడితో ప్రధానమంత్రి మాట్లాడారు. ప్రధానమంత్రి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ తన గ్రామంలో కరెంట్ లేకపోవడం వల్ల చాలా కష్టాలు అనుభవించామని, ప్రస్తుతం పీఎం దీన్ దయాళ్ యోజన ద్వారా కరెంట్ వచ్చిందని సంతోషం వ్యక్తం చేశాడు. జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లికార్జున, నగర మేయర్ హరి వెంకట కుమారి, ఏపీఎస్ఈసీఎమ్ సీఈఓ ఏ.చంద్రశేఖర్ రెడ్డి, ఇంధన శాఖ డిప్యూటీ సెక్రటరీ బి.వి.పి.కుమార్ రెడ్డి, ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్లు బి రమేష్ ప్రసాద్, డి.చంద్రం, రాధిక అనుసూరి, ఏపీఈపీడీసీఎల్ సీజీఎమ్ వి.విజయలలిత, ఎస్ఈ ఎం.బి.సురేష్ కుమార్, సంస్థ అధికారులు, స్థానిక విద్యుత్ వినియోగదారులు, ప్రజలు పాల్గొన్నారు.

దేవుడి సొమ్ముకూ ఎసరు?

- సీజీఎఫ్ డబ్బుపై కన్ను
- దేవస్థానాల ఫిక్స్‌డ్ డిపాజిట్లు రద్దు చేయాలని ఆదేశాలు?

విశాలాంధ్ర-సింహాచలం: ఆలయాలు అభివృద్ధి చెందాలంటే భక్తులు నుంచి వచ్చే కానుకలే ఆధారం. ఇలా వచ్చే రాబడిని ఆయా దేవస్థానాలు ఖర్చులు పోను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తాయి. వీటి ద్వారా వచ్చే వడ్డీతో ఆలయంలో పలు అభివృద్ధి పనులు చేస్తుంటాయి. అయితే దేవస్థానాలకు ఏటా వచ్చే నికర ఆదాయంపై ప్రభుత్వానికి 21.5 శాతం పన్ను చెల్లించాలి. ఇందులో కామన్ గుడ్ ఫండ్ కింద 9 శాతం పన్ను కట్టాలి. కానీ నిర్వహణ ఖర్చులు పెరిగిపోయి, రాబడి పడిపోయిన ఆలయాలు వాటిని చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాయి. విశాఖ జిల్లా వ్యాప్తంగా 1080కి పైగా దేవాలయాలు దేవదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. ఆయా ఆలయాలకు వచ్చే ఆదాయంతోనే నిర్వహణ జరుగుతోంది. ఏటా ఆలయానికి వచ్చే ఆదాయంలో 8 శాతం కంట్రిబ్యూషన్‌గాను, 9 శాతం సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్)కు, అర్చక వెల్ఫేర్ ఫండ్‌కు 3 శాతం, 1.5 శాతం ఆడిట్ ఫీజుగా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన ఆదాయంతో ఆలయంలోని దీప, ధూప నైవేద్యాలు, ఉత్సవాలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే అధిక ఆదాయం వచ్చే 6ఏ ఆలయాలు మినహాయిస్తే 6బీ, 6సీ ఆలయాల్లో ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించలేని పరిస్థితి ఉంది.

6 ఏ కేటగిరీ ఆలయాలకు ఓకే.. కానీ..

దేవాలయానికి వార్షిక ఆదాయం రూ.25 లక్షలు పైబడిన ఆలయాలను 6ఏ కేటగిరీగా పరిగణిస్తారు. నగరంలో సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం, పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానం, వన్‌టౌన్ జగన్నాథ స్వామివారి దేవస్థానం, సీతమ్మధార సాయిబాబా ఆలయం, జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం, అప్పుఘర్‌నగర్ భూసమేత విజయ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం, దొండపర్తి ఎరుకుమాంబ దేవస్థానాలు 6ఏ కేటగిరీలో ఉన్నాయి. రూరల్‌లో అనకాపల్లి నూకాంబికా అమ్మవారి దేవస్థానం మాత్రమే 6ఏ కేటగిరీలో ఉంది. 6ఏ కేటగిరీలో ఉన్న ఆలయ ఉద్యోగులకు దాదాపు ప్రతి నెలా జీతభత్యాలు అందుతాయి. అలాగే రూ.2 నుంచి రూ.25 లక్షల లోపు ఆదాయం వచ్చే ఆలయాలను 6బీ కేటగిరీగా పరిగణిస్తారు. ఇవి జిల్లావ్యాప్తంగా సుమారు 60 ఆలయాలు ఉన్నాయి. ఆలయ ఆదాయ పరిస్థితుల నేపథ్యంలో 6బీ ఆలయాల్లో చాలా మందికి జీతాల బకాయిలు ఉన్నాయి. వీటితోపాటు సుమారు వేయి ఆలయాలు 6సీ కేటగిరిలోకి వస్తాయి. ఆయా ఆలయాలు రెండు లక్షల రూపాయలలోపు వార్షిక ఆదాయం ఉన్నాయి. వాటిలో అధిక శాతం అర్చకుని కంట్రోల్‌లో ఉంటాయి. ఈ పరిస్థితుల్లో 6బీ, 6సీ ఆలయాల్లో చాలా మందికి జీతాలు బకాయిలు ఉన్నాయి. నిజానికి అన్ని ప్రభుత్వ శాఖలకు సర్కారు జీతాలు చెల్లిస్తుండగా, దేవదాయ శాఖలోని ప్రధాన ఆలయాల్లో జీతభత్యాలను ఆయా ఆలయాలకు వచ్చే రాబడి నుంచి చెల్లిస్తున్నప్పుడు.. మళ్లీ ప్రభుత్వానికి కామన్‌గుడ్ ఫండ్ పేరుతో డబ్బులు చెల్లించాల్సి రావడం ఏంటనే ప్రశ్నలు కూడా వ్యక్తమవుతున్నాయి.

వరదలపై టీడీపీ బురద రాజకీయాలు: అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గోదావరి వరదలపై చంద్రబాబు బురద రాజకీయాలు చేస్తున్నారని ఏపీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. వరదల సమయంలో యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం అందించిన సహాయక చర్యలు, బాధితులకు చేసిన సాయం చూడలేక కడుపు మంటతో చంద్రబాబు రగిలిపోతున్నారని ఎద్దేవా చేశారు. గోదావరి వరదల సమయంలో ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా పనిచేసిందని ప్రజలంతా శభాష్ అని మెచ్చుకుంటుంటే బాబు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. గోదావరి వరద ఉధృతితో భారీ నష్టం జరిగింది, వరదల కారణంగా అనేక మంది నిరాశ్రయులయ్యారు. అందుకే ముఖ్యమంత్రి జగన్ వరద సహాయం అందించడానికి ప్రజల దగ్గరికి వెళ్లారు. ప్రభుత్వ చర్యలపై బాధితులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తుండగా, చంద్రబాబు కావాలని ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని అంబటి హితవు పలికారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పరామర్శల పేరుతో చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. 1983లో భద్రాచలంలో కట్ట కట్టానని చంద్రబాబు చెబుతున్నారు. అప్పుడు ఆయన టీడీపీలో ఉన్నారా ?అని మంత్రి ప్రశ్నించారు. పోలవరంపై కూడా కావాలని రాద్ధాంతం చేస్తున్నారని అంబటి మండిపడ్డారు. గతంలో 2018 నుంచి నీళ్లిస్తామని చెప్పిన చంద్రబాబు ఎందుకు ఇవ్వలేకపోయారో ముందు సమాధానం చెప్పాలన్నారు. అసలు కేంద్రం కట్టాల్సిన జాతీయ ప్రాజెక్టును టీడీపీ ప్రభుత్వం ఎందుకు తీసుకుందని ప్రశ్నించారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడం వల్లే 2021 ఖరీఫ్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయామన్నారు. అయితే ఇందుకు గత ప్రభుత్వమే కారణమన్నారు. డ్యామ్ ఎత్తు తగ్గించే ప్రసక్తే లేదని, తొలుత 41.15 అడుగుల ఎత్తు వరకు పూర్తి చేసి నీటిని నిల్వ చేసి, ఆ తర్వాత 45.72 అడుగుల ఎత్తు వరకు పూర్తి చేస్తామని చెప్పారు. నిర్వాసితులకు వచ్చే నాలుగు నెలల్లో పునరావాస సహాయక చర్యలు పూర్తి చేస్తామని అంబటి తెలిపారు.

నష్టాన్ని తగ్గించి చూపుతున్న జగన్

టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిరామ్ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గోదావరి వరదలకు పెద్దమొత్తంలో నష్టం సంభవించినా విపత్తు నిధిని దారిమళ్లించి సీఎం జగన్ కేంద్రానికి నష్టాన్ని తగ్గించి చూపుతున్నారని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. శనివారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం 15 వేల గృహాలు గృహాలు ధ్వంసమైనట్లు నివేదిక ఇస్తే, ఏపీ మాత్రం కేవలం 45ఇళ్లు మాత్రమే దెబ్బతిన్నాయని అవాస్తవాలు చెబుతోందన్నారు. వరదల్లో దెబ్బతిన్న గృహాలు కేవలం 45, మరణించిన పశువులు 9, పంటనష్టం 26 వేల ఎకరాల్లోనేనని నివేదిక పంపడం దుర్మార్గం కాదా? అని ప్రశ్నించారు. రూ.1100 కోట్లు విపత్తు సహాయ నిధి దారి మళ్లింపుపై కొద్ది రోజుల క్రితం హైకోర్టు చీవాట్లు పెట్టినా జగన్ తన తీరు మార్చుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటివరకు విపత్తు నిధి కింద జగన్ రెడ్డి సర్కారుకు వచ్చిన నిధులు రూ.4,164 కోట్లు. ఎస్డీఆర్ఎఫ్ కింద వచ్చిన నిధులు రూ.2,585 కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.470 కోట్లు అందాయి. మరో రూ.470 కోట్లు రావాల్సి ఉన్నాయి. మూడేళ్లలో నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ కింద రూ.1579 కోట్లు అందాయి. మొత్తంగా రూ.4,164 కోట్లు ఇప్పటికే జగన్ రెడ్డి సర్కార్‌కు అందాయి. దీనికి అదనంగా రాష్ట్రం వాటా రూ.1,117 కోట్లు విపత్తు నిధి కింద ఖర్చు చేయాల్సి ఉంది. కేంద్రం ఇచ్చిన నిధులకు జగన్ రెడ్డి లెక్కలు చెప్పలేదు. రూ. 1100 కోట్ల డిజాస్టర్ రిలీఫ్ ఫండ్‌ను జగన్ రెడ్డి ప్రభుత్వం దారిమళ్లించిందని హైకోర్టు చీవాట్లు పెట్టింది. వేల కోట్ల విపత్తు సహాయ నిధిని జగన్ రెడ్డి దిగమింగుతున్నారు. వరదల్లో వాస్తవ లెక్కలు చెబితే.. ఎక్కడ నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందోనని తప్పుడు లెక్కలు చెబుతున్నారు. కేంద్రానికి తప్పుడు నివేదికలు పంపారని ఆయన ధ్వజమెత్తారు. హెలికాప్టర్‌లో చక్కర్లు కొట్టినంత మాత్రాన ప్రజల కష్టాలు తీరతాయా? అదే మా చంద్రబాబు ఎప్పుడు విపత్తు వచ్చినా ప్రజలకు అండగా నిలిచారు. హుద్ హుద్ తుపాను సమయంలో మరుసటి రోజే సహాయక చర్యల్లో చంద్రబాబు నిమగ్నమయ్యారు. తిత్లీ సమయంలో కూడా సమర్థంగా వ్యవహరించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నిద్ర పోకుండా గంటల తరబడి కార్యాలయాల్లో ఉండి ప్రజలను, ఆస్తులను, పంటలను కాపాడారని గుర్తు చేశారు. ఫ్రంట్ ఫుట్‌లో బ్యాటింగ్ చేసే వాళ్లు.. వరదలపై ప్రశ్నిస్తే ఎందుకు వణికిపోతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో వరద బాధితులకు సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

అపురూపకళాఖండానికి ఆదరణ కరువు



విశాలాంధ్ర-విజయవాడ: ఒకప్పుడు కళకళలాడిన మడకశిర కొయ్యరథాన్ని పదిలపరచాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డా. ఈమని శివనాగిరెడ్డి కోరారు. వారసత్వ కట్టడాల పరిరక్షణపై స్థానికులకు అవగాహన కల్పించే 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ' కార్యక్రమంలో భాగంగా, ఆయన అనంతపురం జిల్లా, మడకశిర తేరువీధిలో నిర్లక్ష్యంగా పడిఉన్న అపురూప కొయ్య రథాన్ని శనివారం పరిశీలించారు. విజయనగర పాలన చివరి రోజుల్లో, మడకశిర కోటగుమ్మానికి ఎడమవైపున నిర్మించిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన ఈ కొయ్యరథం చారిత్రక ప్రాధాన్యత గలదని ఆయన తెలిపారు. తిరుమలలోని వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు మడకశిరలో జరిగే లక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా, స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఈ రథంలో ఊరేగించేవారని, 60 ఏళ్ల క్రితం వచ్చిన గాలి, వానకు అక్కడున్న ఒక పెద్దమర్రి చెట్టు విరిగిపడి రథం శిఖరం కూలిపోయి నిర్లక్ష్యానికి గురైందని, చేగు రాధాకృష్ణ గుప్త, గోవిందరాజులు తెలిపారని శివనాగిరెడ్డి చెప్పారు. విజయనగర కాలపు కొయ్య శిల్పుల అద్భుత కళాకౌశలం ఉట్టిపడే శిల్పాలతో రథాన్ని అలంకరించారని, చుట్టూ విష్ణుమూర్తి దశావతారాలు, రామాయణ దృశ్యాలు, శృంగార భంగిమలు, రుషిపుంగవులు, జంతువుల శిల్పాలు, గతవైభవ ప్రాభవాలకు అద్దం పడుతున్నాయని, ఆలనాపాలన లేక, రంగులు వెలసిపోయి, శిల్పాలు రాలి కిందపడిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. క్రీ.శ.17వ శతాబ్దంలో మరాఠా పాలకుడు మురారిరావు వచ్చేంత వరకూ, మడకశిర ప్రాంతం విజయనగర ప్రభువుల ఏలుబడిలో ఉండేదని, వైష్ణవ మత ప్రచారంలో భాగంగా వారు లక్ష్మీవెంకటేశ్వరాలయాన్ని నిర్మించి, ఉత్సవాల కోసం ఈ కొయ్యరథాన్ని తయారు చేయించారని, చారిత్రకంగానే కాక శిల్పకళాఖండంగా కూడా ప్రాధాన్యత గల ఈ కొయ్యరథాన్ని, ఎండా, వానల నుంచి కాపాడి భవిష్యత్తరాలకు అందించాలని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

సంపాదకీయం

జగడాలమారి గవర్నర్లు

కొంతమంది గవర్నర్లకు వివాదాలు లేకపోతే ఏమీ తోచనట్టుంది. ఎనిమిది పదుల వయసున్న మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోషియారీ, మొన్నటిదాకా బెంగాల్ గవర్నరుగా ఉన్న జగదీప్ ధన్ కర్, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తరచుగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లోకి ఎక్కుతుంటారు. మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోషియారీ తాజాగా ఓ వివాదం సృష్టించారు. శుక్రవారం ఒక సమావేశంలో మాట్లాడుతూ గుజరాతీలు, రాజస్థానీలు లేకపోతే మహారాష్ట్రలో డబ్బు ఎక్కడిది అని కోషియారీ అన్న మాట దుమారం రేపింది. అధికార, ప్రతిపక్షాలు గవర్నర్ వ్యాఖ్యలను తూర్పారబట్టాయి. ఈ మాట అనడానికి కోషియారీ వెనకా ముందు చూసుకోలేదు. ప్రస్తుతం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిందే బీజేపీ పంచల్లో చేరినవారే. ఉపముఖ్యమంత్రి ఫడ్నవీస్ సాక్షాత్తు బీజేపీ నాయకుడే. ముఖ్యమంత్రి షిందే కు కూడా కోషియారీ మాటలు రుచించ లేదు. ఆయన వ్యాఖ్యలను తాను అంగీకరించబోనని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే అయితే గవర్నర్ మీద విరుచుకుపడ్డారు. ఆయనను ఇంటికైనా పంపాలి లేదా జైలుకైనా పంపాలి అని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. గవర్నర్ కోషియారీ ప్రశాంతంగా బతుకుతున్న హిందువుల మధ్యే తగవులు పెడ్తున్నారని ఠాక్రే అభిప్రాయ పడ్డారు. కష్టపడి పని చేసే మరాఠీ మాట్లాడే వారిని కించపరిచే ఉద్దేశం తనకు లేదని కోషియారీ ఎన్ని సంజాయిషీలు ఇచ్చుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. కష్టపడి పని చేయడం జనం మాట్లాడే భాషనుబట్టి ఉండదని కోషియారీ లాంటి వారికి ఎలా చెప్తే అర్థమవుతుందో! కోషియారీ మనసులో మహారాష్ట్రీయులు అంటే గూడుకట్టుకున్న విద్వేషం వ్యక్తం అయిందని ఉద్ధవ్ ఠాక్రే అంటున్నారు. మరాఠీ మాట్లాడే వారికి క్షమాపణ చెప్పాలని ఠాక్రే కోరారు. ఇక్కడే ఓ విచిత్రం గమనించాలి. కోషియారీ మహారాష్ట్రకు వ్యతిరేకంగా గంపగుత్తగా వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు తప్ప ఆయన మరాఠీ మాట్లాడే వారు అని ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. ఉద్ధవ్ ఠాక్రే లాంటి వారు కోషియారీ ఆక్రోశం మరాఠీల మీదే అని అనడంలో ఏ సంఘటననైనా రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకోవడంలో నాయకులు రాటుదేరి పోయారని తేలిపోతోంది. నోరు జారడం, ముఖ్యమంత్రులతో విభేదించడం చాలా మంది గవర్నర్లకు పరిపాటి అయిపోయింది. ఆ విషయంలో కోషియారీది కూడా "ఘన" చరిత్రే. కరోనా చెలరేగిన సమయంలో సకలమూ లాక్ డౌన్లో ఉంటే దేవాలయాలు తెరవాలని వాదించి తనను తాను హిందూ జనోద్ధారకుడిగా చూపించుకోవడానికి ప్రయత్నం చేశారు. ప్రసిద్ధ సంఘ సంస్కర్త, మహిళల విద్యావ్యాప్తి కోసం పాటుబడ్డ సావిత్రీ బాయి పూలే మీద అవమానకరమైన వ్యాఖ్యలు చేసి వివాదానికి తెరలేపిన చరిత్రా కోషియారీకి ఉంది. అలాగే ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే శాసన మండలిలో గవర్నర్ కోటా కింద శాసనమండలి సభ్యులుగా నియమించ డానికి రాష్ట్ర ప్రభుత్వం 12 పేర్లు సిఫార్సు చేస్తే కోషియారీ ఆ సిఫార్సును ఆమోదించలేదు. ప్రభుత్వం సిఫార్సు చేసే పేర్ల మీద గవర్నర్ కు హేతుబద్ధమైన అభ్యంతరాలే ఉండొచ్చు. కానీ ఆ విషయం తెలియజేయ డానికి సంప్రదాయంగా వస్తున్న పద్ధతులు ఉన్నాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వాలను ఇరుకున పెట్టడమే పనిగా పెట్టుకున్న గవర్నర్లు వివాదాలు సృష్టించి సంతృప్తి పడుతుంటారు. ముంబైని దేశ ఆర్థిక రాజధానిగా మార్చడంలో గుజరాతీలు, రాజస్థానీలు, మార్వాడీలు చేసిన కృషిని కోషియారీ ప్రస్తుతించారని రాజ్ భవన్ నుంచి ఓ అధికార ప్రకటన వెలువడింది. ఇది మొక్కుబడిగా విడుదల చేసే ప్రకటనే. రాజస్థానీలు, మార్వాడీలు దేశంలోని వివిధ ప్రాంతాలలోనే గాక నేపాల్, మారిషస్ లోనూ ఉన్నారని కోషియారీ ఏదో పెద్ద రహస్యం విప్పి చెప్పినట్టు మాట్లాడారు. మార్వాడీలు, రాజస్థానీలు ఎక్కడికెళ్లినా వ్యాపారంతో పాటు పాఠశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేసి తమ దాతృత్వాన్ని చాటుకుంటారని కూడా కోషియారీ కీర్తిగానం చేశారు.

మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన, నేషనలిస్టు కాంగ్రెస్ ఏర్పాటు చేసిన మహావికాస్ అగాఢీ ప్రభుత్వం పతనమై నెల రోజులైంది. షిందే నాయకత్వంలో శివసేనలోని చీలిక వర్గం, బీజేపీ తో కూడిన ప్రభుత్వం కూడా ఏర్పడింది. విచిత్రం ఏమిటంతే ముఖ్యమంత్రిగా ఏక్ నాథ్ షిందే, ఉపముఖ్యమంత్రిగా పడ్నవీస్ మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. పూర్తి స్థాయి మంత్రివర్గం ఏర్పాటు చేయడానికి బీజేపీ అధినేతల నుంచి అనుమతి తెచ్చుకోవడానికి షిందే దిల్లీకి చక్కర్లు కొడుతూనే ఉన్నారు. ఇంకా ఏలిన వారు కరుణించినట్టు లేదు. పూర్తి స్థాయి ప్రభుత్వం లేకపోయినా గవర్నర్ కోషియారీకి చింత లేదు. పూర్తి స్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి మీద ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం గవర్నర్ కు లేకపోవచ్చు. కానీ ఈ విషయంలో గవర్నర్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మనం అనుసరిస్తున్న పరిపాలనా పద్ధతిని కాబినెట్ ఆధారిత ప్రభుత్వం అంటాం. కానీ మంత్రివర్గం అంటే ఆచరణలో మాత్రం ఒక్క ముఖ్యమంత్రి అన్న ధోరణిలోనే ప్రవర్తిస్తాం. మంత్రివర్గంలోంచి ఒక మంత్రి రాజీనామా చేస్తే ఆయన వ్యక్తిగతంగా రాజీనామా చేసినట్టు. కానీ ముఖ్యమంత్రి రాజీనామా చేస్తే మొత్తం మంత్రివర్గం రాజీనామా చేసినట్టు. ముఖ్యమంత్రినే మంత్రివర్గానికి ప్రతీకగా భావిస్తున్నాం గనకే పూర్తి స్థాయి మంత్రివర్గం ఏర్పడకపోయినా అడిగే వారు లేరు. కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అధిష్ఠానం అనుమతి లభించేదాకా పూర్తి స్థాయి మంత్రివర్గం ఏర్పడే అవకాశం ఉండదని మన రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరు. అందుకే రాజ్యాంగంలో ఈ సమస్యకు పరిష్కారం ఏదీ కనిపించదు. మంత్రివర్గ సభ్యుల నియామకం ఆలస్యమయ్యే కొద్దీ ఏక్ నాథ్ షిందే మీద విశ్వాసం అంతగానే సన్నగిల్లుతూనే ఉంటుంది. తాను అన్న మాట వివాదాలకు తెరలేపుతుందని కోషియారీకి తెలియదనుకోలేం. ఆయన మాటలు కుదేలైపోయి ఉన్న ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన వర్గానికి లేని బలం సంక్రమింప చేసినట్టయింది. శివసేన నుంచి విడిపోయి చాలా కాలం కిందటే మహారాష్ట్ర నవనిర్మాణ సేన ఏర్పాటు చేసిన రాజ్ ఠాక్రేకు కూడా కోషియారీ పని కల్పించారు. శివసేనలోని రెండు వర్గాలు మహారాష్ట్ర మహారాష్ట్రీయులదే అన్న సూత్రం ఆధారంగానే ఏర్పడ్డాయి. కోషియారీ వ్యాఖ్యలు మళ్లీ ఆ భావోద్వేగాలు రెచ్చగొట్టడానికి అవకాశం కల్పించడమే. ఇంకా విచిత్రం ఏమిటంటే కోషియారీ గుజరాతీ వారు కాదు. రాజస్థానీ కాదు. ఆయన ఉత్తరాఖండ్‌కు చెందిన వారు. అయితే ఆయన నోరు జారడానికి కారణం లేకపోలేదు. కేంద్రం నియమించే గవర్నర్లు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి విధేయంగా ఉండడానికి ప్రయత్నించడం కొత్త కాదు. కానీ మోదీ హయాంలో నియమితులవుతున్న గవర్నర్లు హిందుత్వను పెంచి పోషించె భారాన్ని కూడా తమ మీద వేసుకుంటున్నారు. అందుకే రాజును మించిన రాజభక్తి ప్రదర్శిస్తున్నారు.

పెరిగిన గృహ ఆధార వ్యాపారాలు

ఒక మహావిపత్తు మానవాళికి అనివార్యంగా ఎంతో నేర్పింది. కరోనా కల్లోలంతో మనిషి జీవనశైలిలో అపార మార్పులు తెలియకుండానే చోటు చేసుకున్నాయి. వైరస్ అలలు ప్రపంచ మానవాళికి గుణపాఠం నేర్పాయి. వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ఈ–వ్యాపారాలు, ఈ- వైద్య సేవలు లాంటి అనేక రంగాలను పరిచయం చేశాయి. అనేక నూతన వ్యాపార ద్వారాలు తెరుచుకున్నాయి. ఇదే క్రమంతో గృహ–ఆధార వ్యాపారాలకు ఆదరణ పెరిగి విజయవంతంగా లాభసాటిగా కొనసాగుతున్నాయి. డిజిటల్ యుగపు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ లేదా రెండు కలిపి హైబ్రిడ్ సేవలతో గృహం నుంచే ఔత్సాహిక మహిళలు సహితం వ్యాపారాలు చేయడం పరిపాటి అవుతున్నది. ఇంటి నుంచి వ్యాపారాలు చేసే వ్యాపారవేత్తలను 'గృహ పారిశ్రామికవేత్తలు' అనవచ్చు.

నేడు దేశవ్యాప్తంగా దాదాపు 80 శాతానికి పైగా గృహ పారిశ్రామికవేత్తలు మహిళలే కావడం విశేషం. ప్రతికూల పరిస్థితులు, ఆదరణ తగ్గినా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఇండియా 2014లో 142వ స్థానంలో ఉండగా, 2021లో 63వ స్థానానికి ఎగబాకింది. కరోనా ప్రళయ అలల నడుమ ఔత్సాహికులు తమ నూతన వ్యాపార మార్గాలను వెతకడం, ఆకర్షణీయంగా కొనసాగించడం వేగంగా జరుగుతున్నాయి. గృహ కేంద్రిత వ్యాపారాల స్థాపన, సమర్థవంతమైన నిర్వహణ, ఆన్‌లైన్ అమ్మకాలు, నిర్వహణలో ఎదురయ్యే అవరోధాలను పరిష్కరించడానికి మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలు ఔత్సాహికులకు ధైర్యాన్నిస్తున్నాయి. కరోనాతో ఉద్యోగాలు కోల్పోయిన మహిళా ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఇంటి నుంచే వ్యాపారాలు ధీటుగా నిర్వహించడం వంటింటి కుందేలని హేళన చేసిన సమాజం నేడు గృహ ఆధార వ్యాపారాలను చేస్తున్న మహిళలు జోరుగా నిర్వహిస్తున్నారు. వస్త్రాలంకరణ, వస్త్ర విక్రయ కేంద్రాలు, ఫాషన్ డిజైనింగ్, గృహోపకరణాలు, హస్తకళలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, బేకింగ్, కుకింగ్, యోగా, ఫిట్‌నెస్, హోమ్ ఫుడ్స్ లాంటి పలు వ్యాపారాలను ఇంటి నుంచే నిర్వహిస్తూ మంచి గుర్తింపుతో పాటు ఆర్థికంగా లాభాలు గడిస్తున్నారు. వీటికి తోడుగా టెక్నాలజీ ఆధారిత స్టార్టప్‌లు, విలక్షణ అవకాశాలను మహిళామణులు అందిపుచ్చుకుంటూ పురుషులకు ధీటుగా వ్యాపారాలను నిర్వహిస్తూ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలకు తోడ్పడుతున్నారు. ఇలాంటి గృహ ఆధార వ్యాపారాలతో నిరుద్యోగం తగ్గడం, మహిళలకు స్వేచ్ఛ పెరగడం, లింగ అసమానతలు తగ్గడంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధికి ఊతం ఇచ్చినట్లవుతుంది. స్వంత వ్యాపారానికి యజమానురాలిగా తన సమయాన్ని కేటాయించడం, ఆత్మగౌరవం పొందడం, మరి కొందరికి ఉద్యోగ ఉపాధులను కల్పించడం, కుటుంబానికి ఆర్థిక బలాన్ని చేకూర్చడం, తనదైన శైలిలో నడపడం, కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఇతరుల మీద ఆధారపడకపోవడం లాంటి స్వేచ్ఛ, సౌకర్యాలను పొందుతున్నారు.

గృహ ఆధార మహిళా వ్యాపారాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు, సమాజం ముందుకు రావాలి. మహిళా సాధికారత సాధనకు ఈ వ్యాపారాలు ఎంతగానో దోహదపడతాయి. నేటి అనేక బహుళజాతి కంపెనీలు ప్రారంభంలో గృహాల్లో, ఇంటి గ్యారేజీల్లోనే ప్రారంభించబడినవే అని గుర్తు చేసుకోవాలి. మార్కెట్ సరళిని అధ్యయనం చేసి, డిజిటల్ సాంకేతికతను జోడించి, సృజనకు పెద్ద పీట వేసి గృహ సంబంధ వ్యాపారాలను ప్రారంభించడానికి ఔత్సాహిక గృహిణులు చొరవ చూపాలి. తమ వ్యాపార వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచి అమ్మకాలను పెంచుకోవాలి.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

పోరాటాల్లో రాటుదేలిన రామారావు

టి. లక్ష్మీనారాయణ

విశాఖపట్నం హార్బర్–పోర్ట్ వర్కర్స్ యూనియన్ అగ్రనేత కా.వి.వి. రామారావు, నాలుగు దశాబ్దాల పాటు యూనియన్‌కు నేతృత్వం వహించిన విలక్షణమైన,ఎదురులేని కార్మిక నాయకుడు. విశాఖపట్నం పోర్ట్ ట్రస్టు సభ్యులుగా ఇరవై ఐదు సంవత్సరాల పాటు కొనసాగిన ఏకైక కార్మిక నేత. ఆయన జీవితం ప్రత్యేకంగా ప్రభుత్వ రంగంలోని నౌకాశ్రయాల కార్మికోద్యమంతో పెనవేసుకొన్నది. విశాఖపట్నం హార్బర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్, గౌరవాధ్యక్షులుగా కార్మికోద్యమ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తూనే, ఆలిండియా వాటర్ ఫ్రంట్ వర్కర్స్ ఫెడరేషన్, ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏఐటీయూసీ, రాష్ట్ర అధ్యక్షులుగా జాతీయ ఉపాధ్యక్షులుగా, విశాఖ స్టీల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా, చిట్టివలస జూట్‌మిల్ లేబర్ యూనియన్, గౌరవాధ్యక్షులుగా, వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి కార్మికుల హృదయాలలో పదిలమైన స్థానాన్ని సంపాదించుకొన్న ధన్యజీవి.

కమ్యూనిస్టు ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేస్తూ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేటర్ గా ఎన్నికై ప్రజాప్రతినిధిగా కూడా అనుభవం గడించారు. సిపిఐ, విశాఖ నగర కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా, అటుపైరాష్ట్ర నాయకుడుగా ఎదిగారు. ప్రజల మన్ననలను పొందారు. ఆయన కార్మిక కుటుంబం నేపథ్యం నుండి వచ్చిన వారు కాదు. విద్యార్థి దశలో తన స్నేహితుడు కా.కొండపల్లి మాధవరావు ప్రోత్సాహంతో కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితుడై, ఏ.ఐ.ఎస్.ఎఫ్.లో చేరి, నంద్యాల పాలిటెక్నిక్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నప్పుడు నాటి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కా. నీలం రాజశేఖరరెడ్డి సలహా మేరకు విశాఖపట్నం హార్బర్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఉద్యమంలో పూర్తి కాలం పనిచేసే కార్యకర్తగా రంగ ప్రవేశం చేసి, అంచెలంచలుగా ఎదిగారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ విశాఖపట్నం పోర్ట్ డాక్ కార్మికుల చట్టబద్ధమైన హక్కులు, జీవన ప్రమాణాల పెంపు, ఉద్యోగ, సామాజిక భద్రత సాధన కోసం, ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం అంకితభావంతో, అవిశ్రాంతంగా కృషి సల్పారు.

మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకీకరణ విధానాల పర్యవసానంగా ప్రభుత్వ రంగం ధ్వంసమైపోతున్నది. ప్రభుత్వ రంగంలోని నౌకాశ్రయాలను (పోర్టులు)సంక్షోభంలోకి నెడుతున్నారు. భారతదేశ పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిలో పోర్టులు ప్రధాన భూమిక పోషించాయి, పోషిస్తున్నాయి. సామాజిక బాధ్యతను నిర్వర్తించడంలో అగ్రభాగాన నిలిచాయి. పెద్ద ఎత్తున ఉపాధి కల్పనకు దోహదపడ్డాయి. నయా ఉదారవాద ఆర్థికవిధానాలు, ప్రభుత్వరంగం మూలాలపై గొడ్డలి పెట్టుగా పరిణమించాయి. యాజమాన్య, కార్మిక సంబంధాలలో తిరోగమన పరిణామాల వైపు వేగంగా అడుగులు పడుతున్నాయి. కార్మికులసంఖ్య తగ్గిపోతున్నది. దీని ప్రభావం కార్మికోద్యమంపై తీవ్రంగా పడుతున్నది. నౌకాశ్రయాలను మింగేస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చే నాటికి తూర్పు తీరంలో మూడు(వాటిలో విశాఖపట్నం ఒకటి) పశ్చిమాన రెండు, మొత్తం ఐదు ప్రధాన ఓడరేవులు ఉండేవి. ఓడరేవుల ఆవశ్యకతను గుర్తించిన నాటి కేంద్ర ప్రభుత్వం అదనంగా ఎనిమిది ప్రధాన ఓడరేవులు నెలకొల్పింది. దేశ విభజనతో ఉపఖండంలో ఉన్న కరాచీ ఓడరేవును కోల్పోయిన పూర్వరంగంలో1950 దశకంలో ప్రత్యేక ఆర్థికమండలాల అభివృద్ధిలో భాగంగా ప్రప్రథమంగా కాండ్లాఓడరేవు నెలకొల్పారు. 1960 ప్రారంభం నాటికి డిమాండుకు తగ్గట్టుగా ఇనుప ఖనిజం ఎగుమతికి విశాఖపట్నం, మద్రాస్, గోవా నౌకాశ్రయాలు దోహదపడ్డాయి. భారత ప్రభుత్వ నియంత్రణలో 12 ప్రధాన ఓడరేవులు దీనదయాళ్(కాండ్లా, గుజరాత్), ముంబై, జవహర్ లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్, మోర్ముగోవ్(గోవా), న్యూ మంగళూరు (కర్ణాటక), కొచ్చిన్, చెన్నై, కామరాజర్ (ఎన్నోర్, తమిళనాడు), వి.ఓ.చిదంబరనార్ (తూతుకూడి, తమిళనాడు), విశాఖపట్నం, పరదీప్(ఒడిస్సా), కోల్‌కతా ఉన్నాయి. దేశం వర్తకం పరిమాణంలో 90%పైగా, విలువ రీత్యా 70% సముద్ర రవాణా ద్వారా జరుగుతున్నది. ప్రభుత్వం రంగంలోనే పెద్ద ఓడరేవులు పనిచేస్తున్నాయి. ముంబయి సమీపంలో ఉన్న ప్రభుత్వ రంగంలోని ప్రముఖ జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్టుకు పోటీగా ముంద్రా ఓడరేవు అభివృద్ధి చెందుతోంది. దేశంలో దాదాపు సగం విస్తీర్ణం తీరప్రాంతాలలోనే ఉన్నది. ఇది పర్యావరణానికి కూడా ఎంతగానో దోహదపడుతున్నది.

వి.వి. రామారావు

ప్రభుత్వ రంగానికే పరిమితమైన ఓడరేవుల రంగంలోకి 1990 దశకం ద్వితీయార్థంలో పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్(పిపిపి) నమూనాలో ప్రయివేటు యాజమాన్యాలు ప్రవేశించాయి. సాగరమాల ప్రాజెక్టు కింద కొత్తగా ఆరు మెగా పోర్టులను అభివృద్ధి చేయాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకొన్నది. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ రంగంలో ప్రభుత్వ భాగస్వామ్యాన్ని కుదించి వేస్తూ, కార్పొరేట్ శక్తులకు అప్పగించే చర్యలకు మోదీ ప్రభుత్వం పూనుకొన్నది. మేజర్ పోర్టులు తమ కార్యకలాపాలను ప్రైవేట్ భాగస్వామి ద్వారా నిర్వహించే మోడల్‌కు మారుతాయని 2021 సం.వార్షిక బడ్జెట్ ప్రసంగంలోనే కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. నేడు ఆదానీ గ్రూప్ 11 పోర్టులతో ఈ రంగంలో పాగా వేసింది. 205కు పైగా ఉన్న మైనర్ పోర్టుల్లో అనేకం ప్రైవేట్ సంస్థల యాజమాన్యంలో ఇప్పటికే నడుస్తున్నాయి.

ఆదానీ గుప్పిట ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరం

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014లో నెల్లూరు జిల్లా దుర్గరాజపట్నం వద్ద ఓడరేవును కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తుందని పేర్కొన్నది. ఒక పక్కన చెన్నయ్, మరొక పక్కన కృష్ణపట్నం, అలాగే సమీపంలో శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రం ఉండడం వల్ల అక్కడ సాధ్యంకాదని కేంద్ర ప్రభుత్వం చెప్పిన మీదట రామాయపట్నం వద్ద నెలకొల్పమంటే దాన్ని మైనర్‌పోర్టుగా రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించింది కాబట్టి కేంద్రం నెలకొల్పడానికి వీలుకాదని మోదీ ప్రభుత్వం తేల్చేసింది. రామాయపట్నం ఓడరేవు కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాడి హక్కుగా సాధించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. రు.3,736 కోట్ల వ్యయ అంచనాతో మొదటి దశ నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రెండవసారి శంకుస్థాపన చేశారు. ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్న మచిలీపట్నం, భావనపాడు, కాకినాడ గేట్ పోర్టు నిర్మాణానికి కూడా త్వరలోనే శ్రీకారం చుడతామని చెబుతున్నారు. నిర్మాణంలో అడుగు ముందుకు పడుతుందో! లేదో! భవిష్యత్తులో తేలుతుంది.

మరొకవైపు, గంగవరం పోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఉన్న 10.39% వాటాను మోదీ ప్రభుత్వ సహకారంతో బడా కార్పొరేట్ సంస్థగా ఎదిగిన ఆదానీ గ్రూపుకు అమ్మేశారు. అంతకు ముందే ఆదానీ డి.వి.ఎస్. రాజు కుటుంబం నుంచి 58.1% వాటాలను, వార బర్గ్‌పింకర్స్ నుంచి 31.5%వాటాలను కొనేశారు. కృష్ణపట్నం పోర్టును కొనేశారు. విశాఖపోర్టులో విభాగాల వారిగా ప్రయివేటీకరిస్తున్నారు. ఆదానీగ్రూప్ విశాఖపోర్టులో ఒకబెర్త్‌ను లీజుకు తీసుకొని వినియోగించకుండా పేచీపెట్టుకొన్నదని తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరం, ఓడరేవులు, కార్పొరేట్ దిగ్గజం ఆదానీ గ్రూప్ లాంటి సంస్థల సొంతమైతే సంభవించే దుష్పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ సమాజం తీవ్రంగా ఆలోచించాలి. కార్మిక వర్గం సాగించిన వీరోచిత పోరాటాల చరిత్రను, అమరజీవి కా.వి.వి. రామారావు లాంటి నేతల స్ఫూర్తితో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, ఆంధ్రప్రదేశ్ సముద్రతీరం కార్పొరేట్ శక్తుల హస్తగతం కాకుండా ప్రజల భాగస్వామ్యంతో కార్మికవర్గంసమైక్యంగా సమరశీలఉద్యమాలకు నడుం బిగించాలి.

(రేపు రామారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా)

వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు

కృష్ణచైతన్యమంటే విశృంఖల శృంగారమేనా?

డాక్టర్ దేవరాజు మహారాజు

రాముడు ఈ దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన దేవుడు. కృష్ణుడు అలాకాదు, సాంస్కృతికంగా ముద్ర వేసుకుని, అంతర్జాతీయంగా వ్యాపించిన వాడు. "కృష్ణాకాన్షియస్", "హరేకృష్ణ" సమూహాలతో ఖండాంతరాలకు వ్యాపించి భారతీయుల చిత్త భ్రమల్ని విశ్వవ్యాప్తం చేసినవాడు. నిజానికి వీరిద్దరూ హిందూ పురాణాల్లోని కల్పిత పాత్రలే! మూఢ విశ్వాసకుల మనసుల మీద పట్టు సాధించి, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా వేళ్లూనుకుని నిలబడ్డ పాత్రలు. గతకాలంలో గుళ్ళల్లో, శిల్పాల్లో స్థానం సంపాదించుకున్న పాత్రలు. కాలానుగుణంగా కవుల్ని, శిల్పకారుల్ని, చిత్రకారుల్ని, సంగీతకారుల్ని, ఇతర కళాకారుల్ని ప్రభావితం చేసిన, చేస్తున్న పాత్రలు.గతంలో రాముడు ఎక్కువగా పూజలందుకుంటే – కృష్ణుడు ఆధునిక యుగానికి చెందిన రచయితల్ని, తత్త్వవేత్తల్ని నవీన విశ్వాసాల్లోకి లాక్కు పోయాడు. కృష్ణప్రేమను గీతాల్లో వర్ణించినవారు, చిత్రలేఖనంగా చిత్రించినవారు తమకు తాము ఆధునికులుగా భావించుకుంటున్నారు. పూజ, దీపధూపాలు, నారికేళాలు వదిలి, ఒక అలౌకిక సౌందర్యారాధననే కృష్ణచైతన్యమన్నారు. కృష్ణప్రేమనే విశ్వప్రేమ అన్నారు. ఒక ఆలోచనాధోరణి గలవారంతా గ్రూపులుగా ఏర్పడ్డారు. చివరకి మాదక ద్రవ్యాలకు, మద్యానికి బానిసలై విశృంఖల శృంగారాన్ని కాంక్షిస్తూ –ఫ్రీ సెక్స్–ప్రచారకులై ప్రపంచవ్యాప్తంగా పాకిపోయారు.

ఇప్పుడు మనం ఆలోచించాల్సిందేమంటే వీరివల్ల సమాజ సంస్కరణ జరిగిందా? వీరి వల్ల ఏమైనా ప్రగతి సాధ్యమైందా? సగటు మనిషి జీవన ప్రమాణాలు ఏమైనా పెరిగాయా? అన్నది మాత్రమే! తాళమేళాలతో భజనలు చేస్తూ ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా పోవడం – కృష్ణస్పృహను ప్రచారం చేయడం ప్రపంచవ్యాప్తంగా జరుగుతూ ఉంది. నేను స్వయంగా మెల్బోర్న్‌లో చాలాసార్లు చూశాను. పౌరులుగా వీరు తమ మీద వేసుకుని నిర్వహిస్తున్న 'బాధ్యత' ఏమిటో ఎవరికీ తెలియదు. ఆ ఊరేగింపుల్లో వాళ్ళ సాహిత్యాన్ని, కరపత్రాల్ని, చిరుపొత్తాల్ని, అమ్ముకుంటూ ఉంటారు. విరాళాలు సేకరిస్తూ ఉంటారు. అక్కడ ప్రచారం, వ్యాపారం రూపు మార్చుకున్నదే గానీ, అసలు లేకుండా లేదు. తమది అత్యున్నతమైన, ఉదాత్తమైన, తాత్విక చింతన అని భావిస్తూ, అదే స్థాయిలో ఉపన్యాసాలు ఏర్పాటు చేస్తారు. అయితే అవన్నీ, నేల విడిచి సాము చేయడం లాంటివే. అసలు 'కృష్ణుడెవరూ? అది తేల్చండిరా బాబూ!' అంటే ఎవరి దగ్గరా సరైన సూటి సమాధానం ఉండదు. విషయమేమీ లేకపోయినా అందమైన ఇంగ్లీషు భాషలో, మెత్తని గొంతుతో శ్రావ్యంగా మాట్లాడతారు. కానీ దానివల్ల ఒనగూరే ప్రయోజనమేమిటీ? జనంలో జ్ఞానం పెరగదు. ఎంత ఉన్నతీకరించి చెప్పే మాటలైనా అవన్నీ ఒక కల్పిత పాత్ర గురించే కదా? కృష్ణుడే కల్పిత పాత్ర అయితే ఇంకా దాన్ని సింబాలిక్‌గా వ్యక్తీకరించడం దానికి "ఆహా–అద్భుతం" అని అనేవాళ్ళు కొందరుండడం చూస్తున్నాం. మనం మేజిక్ షోకు వెళ్ళినప్పుడు ఆశ్చర్యపోయి అద్భుతమనే అంటాం. అంతమాత్రం చేత మేజిక్ ట్రిక్కుల్ని నిజాలని నమ్మం కదా?

వాస్తవంగా మనం చూసి తెలుసుకుంటున్న విషయాలు కొన్నయితే మనకంటే ముందు తరాల వారు రాసిన గ్రంథాల్లోంచి తెలుసుకోవాల్సిన విషయాలు కొన్ని. వైదిక రచయితలు అదుపు తప్పిన తమ లైంగిక కోరికలన్నీ కృష్ణుడనే కల్పిత పాత్రకు ఆపాదించి ఎట్లా రాసుకున్నారో చూద్దాం. నీతి, నియమాలు, నైతికతా లేని ఒక పాత్రను సృష్టించి, దానితో గమ్మత్తులు, అద్భుతాలూ చేయించి, వాటికి మహిమలని, లీలలని పేర్లు పెట్టి జనాన్ని కొన్ని శతాబ్దాలుగా వెర్రివాళ్ళను చేస్తూ వస్తున్న వైనం ఎలాగుందో కొంచెం జాగ్రత్తగా గమనిస్తే అర్థమవుతుంది. 'ఎందెందు వెదికిన అందందే గలడు చక్రి' అనడం ఎంత అబద్ధం? వాస్తవంగా ఉన్నవాడైతే ఒక్కడే ఉంటాడు. రెండుగా కనబడడం, రెండు చోట్లా ఒకేసారి కనబడడం అనేది జరగదు. అలాంటిది వేలమంది గోపికలతో వేలమంది కృష్ణులుగా సరసాలాడడమనేది కేవలం ఊహల్లోనే సాధ్యం! వాస్తవ జగత్తులో సాధ్యం కాదు. అలా అని రాసుకున్నారు గనకనే, అలాంటివన్నీ చిత్త భ్రమలని అంటున్నాం! అభూత కల్పనలని తేల్చిపారేస్తున్నాం!!

వాస్తవంగా మనం చూసి తెలుసుకుంటున్న విషయాలు కొన్నయితే మనకంటే ముందు తరాలవారు రాసిన గ్రంథాల్లోంచి తెలుసుకోవాల్సిన విషయాలు కొన్ని, వైదిక రచయితలు అదుపు తప్పిన తమ లైంగిక కోరికలన్నీ కృష్ణుడనే కల్పిత పాత్రకు ఆపాదించి ఎట్లా రాసుకున్నారో చూద్దాం. నీతి, నియమాలు, నైతికతా లేని ఒక పాత్రను సృష్టించి, దానితో గమ్మత్తులు, అద్భుతాలూ చేయించి, వాటికి మహిమలని, లీలలని పేర్లు పెట్టి జనాన్ని కొన్ని శతాబ్దాలుగా వెర్రివాళ్ళను చేస్తూ వస్తున్న వైనం ఎలాగుందో కొంచెం జాగ్రత్తగా గమనిస్తే అర్థమవుతుంది. 'ఎందెందు వెదికిన అందందే గలడు చక్రి' అనడం ఎంత అబద్ధం? వాస్తవంగా ఉన్నవాడైతే ఒక్కడే ఉంటాడు. రెండుగా కనబడడం, రెండు చోట్లా ఒకేసారి కనబడడం అనేది జరగదు. అలాంటిది వేలమంది గోపికలతో వేలమంది కృష్ణులుగా సరసాలాడడమనేది కేవలం ఊహల్లోనే సాధ్యం! వాస్తవ జగత్తులో సాధ్యం కాదు. అలా అని రాసుకున్నారు గనకనే, అలాంటివన్నీ చిత్త భ్రమలని అంటున్నాం! అభూత కల్పనలని తేల్చిపారేస్తున్నాం!!

అసలు కృష్ణుడు ఒకడు కాదని, ఉన్నవారిలో అసలైన వాడెవరో తేల్చడం కష్టమని అన్నారు బిపిన్ చంద్రపాల్ (1858–1932) స్వాతంత్ర్య సమర యోధుడు, రచయిత, వక్త, దేశంలో విప్లవ ఆలోచనా ధోరణికి పితామహుడు. బెంగాల్ విభజనని వ్యతిరేకించినవాడు. అరబిందోతో కలిసి స్వదేశీ ఉద్యమాన్ని చేపట్టినవారు. ఈయన చెప్పిన దాని ప్రకారం ఆర్యరుషి కృష్ణుడు ఒకడైతే, ఆర్యేతర కృష్ణుడు మరొకడు. ఆర్యరుషి కృష్ణుడికి విశ్వకుడు అనే కొడుకు, విష్ణువుడు అనే మనుమడు ఉన్నారు. ఈ ఆర్య కృష్ణుడికి పనేమీ లేదు. కేవలం అశ్వనీ దేవతల్ని ప్రార్థిస్తూ ఉండడమే ఆయన ముఖ్య కార్యక్రమం. ఇక ఆర్యేతర కృష్ణుడిని రుగ్వేదంలో రాక్షసుడిగా చిత్రించారు. ఇవి ఇలా ఉంటే సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యమున్న రచయిత సి. నీరద్ చౌదరి పురాణాల్లోని విశృంఖల శృంగారాన్ని ఇంకా ఇతర ఘోరమైన విషయాల్ని సంస్కృతం నుండి ఇంగ్లీషులోకి అనువదించి "హిందూయిజం" పేరుతో ప్రకటించారు. అది 1979లో న్యూఢిల్లీలో అచ్చయ్యింది. 'బ్రహ్మవైవర్తం'లోని కొన్ని వాక్యాలు చూడండి. ఏ తక్కువ స్థాయి సెక్స్ రచయిత కూడా అంత బాహాటంగా రాయడు. పవిత్ర గ్రంథాల పేరుతో ఆర్య మనువాదులు ప్రమోట్ చేసుకున్నవి ఇవేనా? మాంస భక్షణ, విశృంఖల శృంగారం వారి నైజమా?

"కృష్ణుడు రాధను వివస్త్రను చేసి, ఆమె స్తనాలను పట్టుకుంటాడు. నాలుగు రీతులుగా చుంబిస్తాడు. సంభోగంలో రాధ గజ్జలు తెగిపోతాయి. ముద్దులతో ఆమె పెదాలు ఎరుపెక్కాయి. స్తనాలపై గంధం చెరిగిపోతుంది. కొప్పు ఊడి, బొట్టు చెదిరిపోతుంది...ఆ తర్వాత రాధ కృష్ణుడి పైకివచ్చి...." ఉదాహరణకు నేనిక్కడ నాలుగువాక్యాలే ఇచ్చాను. నీరద్ చౌదరి అనువాదంలో పేజీలకు పేజీలే కామక్రీడ వర్ణనలున్నాయి. అనువాదంలో ఉన్నాయంటే, సంస్కృతమూలం 'బ్రహ్మ వైవర్తం'లో ఉన్నట్టే కదా? ఇందులో కృష్ణ ప్రేమ, విశ్వ ప్రేమ ఎక్కడుందో మనలాంటి వారికి అర్థంకాదు. ఆదీ, అంతంలేని ఆ భగవంతుడి లీలలు ఏమున్నాయో, అనంతంలో కలిసిపోయేది ఇందులోఏముందో అర్థం కావాలంటే కొంచెం పిచ్చి, మరికొంచెం పైత్యం ఉండాల్సిందే! ఇంకా కృష్ణుడు సాగించిన గ్రంథం ఇలా ఉంది. "రాధతో జరిపే క్రీడలో పూర్తిగా లీనమైపోయిన కృష్ణుడు తను గోపికలకు అన్యాయం చేస్తున్నానని భావించాడు. ఉద్యానవనం లోకి వెళ్ళాడు. అక్కడఉన్న పదహారువేల గోపికలకు ఒక్కొక్క కృష్ణుడిగా మారి పోయాడు. వారితో సంభోగించాడు. సామూహిక సంభోగప్రక్రియలో ఉద్యానవనం ప్రతిధ్వనించింది". గిచ్చుళ్ళు, కొరుకుళ్ళు, గాజుల చప్పుళ్ళు, కాళ్ళ పట్టీల ధ్వనులు వగైరా పారవశ్యం పొందేదాకా బ్రహ్మవైవర్తంలో వర్ణనలు విపులంగా కొనసాగాయి. ఆ రచనల ప్రభావంతోనే కృష్ణ భక్తులు కృష్ణప్రేమను, లైంగిక స్వేచ్ఛనూ, మాదకద్రవ్య సేవనాన్ని ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా జరుపుకుంటున్నారు. ఇలాంటి రచనల ప్రభావంతోనే బహుశా ఇటీవల కాలం దాకా సామూహిక సంభోగప్రక్రియ కొనసాగింది. దానినే కదా శిల్పులు శిల్పాలు చెక్కారు. ఆ కేళీ విన్యాసాన్నే కదా గాయకులు మైమరచి పాడుకున్నారూ?

ఇలాంటి కృష్ణుణ్ణి ఊహించుకునే కృష్ణ భక్తులు, వైష్ణవ భక్తులూ అయిన చైతన్యుడు, వల్లభాచార్యుడు, జయదేవుడు, మీరాబాయి గొప్ప పారవశ్యంలోకి జారిపోయారూ? చండీదాస్, సూర్‌దాస్, మన పోతన లాంటివారు కవితా గానం సాగించారు. యోగులందరికీ గురువైన నారాయణుడు 'కృష్ణుడు దేవుడు, గోపికలంతా మాత్రులు" అని అన్నాడు. అంటే మానవుడు మాధవుడు ఐక్యమయ్యారని అది వర్ణనాతీతమనీ.. భక్తులు భావిస్తారు. దీన్నే 'అనంతం'లో కలిసిపోవడంగా భావించి, కృష్ణచైతన్య ప్రచారకులు భక్తి–ఆధ్యాత్మికతల మీద వారికే అర్థం కాని విషయాల్ని ఇతరులకు బోధిస్తుంటారు. దానికి 'కృష్ణమాయ' అని ఓ పేరుకూడా పెడతారు. ఆ కల్పితపాత్రతో అభూత కల్పనల రాసక్రీడలు చేయిస్తూ కొంతమంది ఆధునిక రచయితలు కూడా గ్రంథాలు ప్రకటించారు. వారిలో ధీరేంద్రనాథ్ పాల్, మోహన్‌లాల్ సేన్, ప్రతాప్ ఆర్ పరేఖ్, మోనికా వర్మ, బాబా పరమానంద్ లాంటివారు కొందరున్నారు.

కృష్ణుణ్ణి ఎవరూ అర్థం చేసుకోలేదని, అతని మార్మికవాదం గొప్పదని కొందరన్నారు. కృష్ణుడు హిందువులకే కాదు, అందరికీ దేవుడేనన్నాడు మోహన్‌లాల్ సేన్. నిజమే సంభోగక్రీడ హిందువులకే పరిమితం కాదుగదా? ఓషో రజనీష్ కూడా లైంగికస్వేచ్ఛనే బోధించివిదేశాల్లో ప్రాచుర్యం సంపాదించాడు. ఎ.ఎస్.పి.అయ్యర్ మరోచిత్రమైన అంశం ప్రకటించాడు. కృష్ణుడు పురుషులందరికీ తండ్రి అని, స్త్రీలందరికీ భర్త అనీ రాశాడు. (అంతరార్థం ఏమిటీ అని ఎవరూ మెదడు పాడు చేసుకోనక్కర లేదు). వీరందరి కంటే డొనాల్డ్ ఆర్ కిన్ స్లే మరో అడుగు ముందుకేసి "కామంతోనే మోక్షం సాధించగల"మని అన్నారు. The Sword & The Flute పేరుతో పుస్తకం రాశాడు. మానవ బలహీనతల్లో ప్రధానమైన లైంగికతను ప్రేరేపించడానికి ఇలా కొన్ని అంతర్జాతీయ సంస్థలు అవసరమా? లైంగిక ప్రేరేపణ జంతువుల్లో కూడా ఉందన్నది వీరికి తెలియదా? స్త్రీ పురుషుల మధ్య కేవలం లైంగిక సంబంధాలు మాత్రమే చూసిన ఆర్య/వైదిక/మనువాద రచయితలకు మానవ సంబంధాలంటే ఏమిటో తెలియదన్నమాట!

గతంలో ఉన్న ఆ చెత్తనంతా ముందు బయటపారెయ్యాలి! స్త్రీ పురుష సంబంధాల్లో ప్రేమకు ఎంత విలువఉందో, దాన్నెంతజాగ్రత్తగా, గౌరవప్రదంగా, సమాన స్థాయిలో అపురూపంగా నిలుపుకోవాలో వివేకవంతులైన నేటి యువతీ యువకులకు తెలుసు. కాలక్రమంలో నాగరికత నేర్పిన ఎన్నో అంశాల్లో అదొక ప్రధానమైన అంశం! అది అర్థం చేసుకుంటూ, మానవీయ విలువల ప్రతిష్ఠాపన దిశగా మనమంతా ప్రయాణించాల్సి ఉంది.

వ్యాస రచయిత సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవ శాస్త్రవేత్త.

ఉత్తరాఖండ్‌లో కుండపోత

రహదారుల మూసివేత

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని వివిధ ప్రాంతాలలో శనివారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా కొండ ప్రాంతాల్లో అనేక కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలకు వెళ్లే 250 జాతీయ రహదారులు దిగ్బంధమయ్యాయి. ధార్చులలో ఆరు నివాస గృహాలు కూడా దెబ్బతిన్నాయని రాష్ట్ర విపత్తు నియంత్రణ సంస్థ తెలిపింది. అయితే అప్పటికే ఇళ్లలోని నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ధార్చులలోని 17 ఇళ్లలోని 53 మందిని సురక్షితంగా తరలించే ప్రయత్నాల్లో కుమావోన్ స్కౌట్స్ పితోర్‌ఘర్ సాయం అందించింది. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని కొండలు, మైదాన ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. డెహ్రాడూన్‌లో అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. భారీ కొండచరియలు విరిగిపడటంతో లంబాగడ్ వద్ద 10-15 మీటర్ల మేర రిషికేశ్-బద్రీనాథ్ జాతీయ రహదారి పూర్తిగా దెబ్బతింది. బన్స్వారా వద్ద రిషికేశ్-కేదార్‌నాథ్ జాతీయ రహదారిని కూడా మూసివేశారు. ప్రభావిత రహదారుల్లో 11 రాష్ట్ర రహదారులు, 239 గ్రామీణ రహదారులు ఉన్నాయి. జానకిచట్టి-యమునోత్రి ట్రెక్ మార్గాన్ని కూడా భనేలీగాడ్‌లో మూసివేశారు.:

రాజస్థాన్‌లో...

రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లోను, దాని పశ్చిమ, తూర్పు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడుతున్న వాతావరణశాఖ తెలిపింది. ఝలావర్‌లోని ఖాన్‌పూర్‌లో అత్యధికంగా 90 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోటలోని చెచాట్, శ్రీగంగానగర్‌లోని కరణ్‌పూర్, హనుమాన్‌గఢ్‌లోని నోహర్‌లో 60 మిల్లీమీటర్లు, బరన్‌లోని అంటా, శ్రీగంగానగర్‌లో 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల 10 నుంచి 40 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ వెల్లడించింది.

కోలుకున్న తొలిసారి మంకీపాక్స్ సోకిన వ్యక్తి

తిరువనంతపురం: దేశంలో మొట్టమొదటిసారిగా మంకీపాక్స్ సోకిన వ్యక్తి కోలుకున్నట్టు కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ శనివారం తెలిపారు. కొల్లంకు చెందిన 35 ఏళ్ల వ్యక్తిని డిశ్చార్జ్ చేసినట్టు ఆమె చెప్పారు. దేశంలోనే మంకీపాక్స్ సోకిన తొలి కేసు కావడంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్‌ఐవి) సూచనల మేరకు 72 గంటల వ్యవధిలో రెండుసార్లు పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. 'అన్ని నమూనాలు రెండుసార్లు కూలంకషంగా పరిశీలించాం. రోగి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నాడు. శరీరంపై వచ్చిన మచ్చలు పూర్తిగా నయమయ్యాయి. అందుకే డిశ్చార్జ్ చేశాం' అని జార్జ్ తెలిపారు. అతనితో ప్రాథమిక కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న అతని కుటుంబ సభ్యుల పరీక్ష ఫలితాలు కూడా ప్రతికూలంగా వచ్చినట్టు మంత్రి వివరించారు. ప్రస్తుతం, ఇన్‌ఫెక్షన్‌కు పాజిటివ్‌గా తేలిన మరో ఇద్దరు వ్యక్తుల ఆరోగ్య పరిస్థితి సంతృప్తికరంగా ఉందని, నివారణ, నిఘా చర్యలు అదే శక్తితో కొనసాగుతాయని మంత్రి తెలిపారు. జులై14న విదేశాల నుంచి కేరళకు వచ్చిన వ్యక్తికి మంకీపాక్స్ సోకినట్టు గుర్తించారు.

కేరళ రచయితపై రెండో లైంగిక దాడి కేసు

కోజికోడ్ (కేరళ): ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త సివిక్ చంద్రన్ లైంగిక వేధింపుల కేసులో ముందస్తు బెయిల్ కోసం ఎదురు చూస్తున్న తరుణంలో, ఆయనపై మరో మహిళా రచయిత కూడా ఫిర్యాదు చేశారు. 2020 ఫిబ్రవరిలో పట్టణంలో జరిగిన పుస్తక ప్రదర్శనలో చంద్రన్ లైంగికంగా తనను వేధించాడని మహిళా రచయిత్రి శుక్రవారం కోయిలాండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా చంద్రన్‌పై రెండో కేసు నమోదు చేసినట్టు పోలీసులు వివరించారు. షెడ్యూల్డ్ తెగ కమ్యూనిటీకి చెందిన ఒక మహిళా రచయిత్రిని లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ గతవారం చివరో చంద్రన్‌పై కేసు నమోదైంది. ఏప్రిల్‌లో జరిగిన పుస్తక విడుదల కార్యక్రమంలో చంద్రన్ లైంగిక దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు రచయిత్రి ఆరోపించారు. అప్పటి నుంచి తనను ఫోన్‌లో నిరంతరం ఇబ్బంది పెడుతూనే ఉన్నాడని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు లైంగిక నేరంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద మరో కేసు నమోదు చేశారు. అయితే చంద్రన్ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కాగా, నిందితుడు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శనివారం ఇక్కడి కోర్టు తన ఉత్తర్వులను ఆగస్టు 2కి వాయిదా వేసింది.

ఖరీఫ్ సీజన్‌లో వరినాట్ల లోటు భర్తీ: తోమర్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్ల లోటును భర్తీ చేసే అవకాశం ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ శనివారం తెలిపారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ తాజా సమాచారం ప్రకారం, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జూన్ 29 నాటికి వరిసాగు విస్తీర్ణం 35.46 లక్షల హెక్టార్లు తగ్గి 231.59 లక్షల హెక్టార్లకు చేరుకుంది. ఇది ఏడాది క్రితంతో పోలిస్తే 267.05 లక్షల హెక్టార్ల వరి నాట్లు ఇప్పటివరకు తగ్గాయనీ, లోటును భర్తీ చేసే అవకాశం ఉందని తోమర్ పేర్కొన్నారు. ఈ ఖరీఫ్‌లో ఇప్పటివరకు పశ్చిమ బెంగాల్ (10.62 లక్షల హెక్టార్లు), ఉత్తరప్రదేశ్ (6.68 లక్షల హెక్టార్లు), బీహార్ (5.61 లక్షల హెక్టార్లు), జార్ఖండ్ (4.72 లక్షల హెక్టార్లు), తెలంగాణలో (4.06 లక్షల హెక్టార్లు) వరిసాగు తగ్గినట్లు పేర్కొన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, త్రిపుర, అసోంలలో వరి సాగు తక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణంగానే ఉంటాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. జూన్ 1, జులై 27 మధ్య దేశం మొత్తం మీద 10 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. అయితే అదే సమయంలో తూర్పు, ఈశాన్య భారతదేశంలో 15 శాతం లోటు నమోదైంది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరాం, మణిపూర్‌లలో వర్షాలు తక్కువగా ఉన్నాయి.

బీజేడీ మాజీ ఎమ్మెల్యే ఆస్తుల జప్తు

న్యూఢిల్లీ: ఒడిశాకు చెందిన సీషోర్ గ్రూప్ ఆఫ్ కంపెనీలపై మనీలాండరింగ్ కేసులో బీజేడీ మాజీ ఎమ్మెల్యే, మీడియా సంస్థకు చెందిన రూ.3.92 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు శనివారం తెలిపారు. ఒడిశాలోని కటక్-చౌద్వార్ అసెంబ్లీ స్థానం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రవత్ బిస్వాల్ రూ.25 లక్షల బ్యాంకు డిపాజిట్లను అటాచ్ చేస్తూ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర ఏజెన్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కేసులో 2017లో సీబీఐ అరెస్ట్ చేసిన బిస్వాల్, ఆ తర్వాత బెయిల్ మంజూరు చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న మీడియా గురు కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన స్థిరాస్తిని కూడా ఏజెన్సీ అటాచ్ చేసింది. అటాచ్ చేసిన ఆస్తుల మొత్తం విలువ రూ.3.92 కోట్లని ఈడీ తెలిపింది.

వచ్చే నెలలో మోదీ కవితల పుస్తకం

'లెటర్స్ ఆఫ్ సెల్ఫ్' విడుదల



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ గుజరాతీ కవితా పుస్తకానికి ఆంగ్ల అనువాదం 'లెటర్స్ టు సెల్ఫ్' ఆగస్టులో విడుదల కానుంది. చాలా సంవత్సరాలుగా వ్రాసిన 'ఆంఖ్ ఆ ధన్య ఛే' అనే కవితా సంకలనం 2007లో విడుదలయింది. దీనిని సినీ పాత్రికేయుడు, చరిత్రకారుడు భావనా సోమయ్య ఆంగ్లంలోకి అనువదించారు. ప్రకాశ్ బుక్స్ కంపెనీ ఫింగర్ ప్రింట్ ద్వారా ఇది ప్రచురితమయింది. ఇది ప్రాసతో ప్రాణం పోసుకున్నదని, ప్రపంచంతో పంచుకోవడానికి ప్రధాని మోదీ ఎప్పటికీ వెనుకాడరని, ప్రకృతి అందాల నుంచి జీవితంలోని ఒత్తిళ్లు, పరీక్షల వరకు అనేక విషయాలపై తన ఆలోచనలు, కలలు, ఆందోళనను ఆయన వ్యక్తం చేశారని ప్రచురణ సంస్థ పేర్కొంది. 2020లో మోదీ రాసిన 'లెటర్స్ టు మదర్' అనే పుస్తకం, ఆయన యువకుడిగా మాతృ దేవతకు రాసిన లేఖలను కూడా సోమయ్య గుజరాతీ నుంచి అనువదించారు. గుజరాతీలో అనేక పుస్తకాలతో పాటు యువ విద్యార్థులకు పరీక్షల ఒత్తిడిని ఎదుర్కోవడంలో సహాయపడటానికి ప్రధాన మంత్రి 'ఎగ్జామ్ వారియర్స్' ను కూడా రచించారు.

గవర్నర్ వ్యాఖ్యలతో ఏకీభవించను

- ముంబై అభివృద్ధిలో మరాఠీల కృషి విస్మరించలేనిది
- మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే

ముంబై: ముంబైపై గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవించడం లేదని, నగరాభివృద్ధిలో మరాఠీ ప్రజలు చేసిన కృషిని ఎన్నటికీ విస్మరించలేమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే శనివారం తెలిపారు. నాసిక్ జిల్లాలోని మాలెగావ్‌లో విలేకరులతో మాట్లాడిన షిండే, 'ముంబైపై కోశ్యారీ అభిప్రాయంతో మేము ఏకీభవించడం లేదు. అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం. ఇప్పుడు ఒక స్పష్టత ఇచ్చారు. ఆయన రాజ్యాంగబద్ధమైన పదవిని కలిగి ఉన్నాడు. ఆయన చర్యలు ఇతరులను అవమానించకుండా జాగ్రత్త వహించాలి. మరాఠీ సమాజం కృషి ముంబై అభివృద్ధికి, పురోగతికి దోహదపడింది. ముంబై నగరం దేశం నలుమూలల నుంచి ప్రజలకు తమ నివాసంగా ఉన్నప్పటికీ, మరాఠీ ప్రజలు తమ గుర్తింపును, గర్వాన్ని కాపాడుకున్నారు. దానిని అవమానించకూడదు' అని అన్నారు. ముంబైని మహారాష్ట్ర రాజధానిగా చేయాలంటూ జరిగిన ఆందోళనలో 105 మంది ప్రాణత్యాగం చేశారని, శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాకే నగరం మరాఠీ గుర్తింపును కాపాడడంలో పాత్ర పోషించారని షిండే చెప్పారు. 'ముంబై, మరాఠీలను ఎవరూ అవమానించలేరు. ముంబై అనేక విపత్తులను ఎదుర్కొంది. కానీ అది ఎప్పటికీ ఆగదు. కొనసాగిస్తుంది. వేలాది మందికి జీవనోపాధిని ఇస్తుంది' అని ముఖ్యమంత్రి చెప్పారు. ధులేలో ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విలేకరులతో మాట్లాడుతూ మహారాష్ట్ర అభివృద్ధిలో మరాఠీ మాట్లాడే ప్రజలదే సింహభాగం అని అన్నారు. 'పారిశ్రామిక రంగంలో కూడా మరాఠీ మాట్లాడే ప్రజలు ప్రపంచ ప్రగతిని సాధించారు. గవర్నర్ వ్యాఖ్యలతో మేము ఏకీభవించడం లేదు' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు.

సీడీఎస్ నియామకంలో జాప్యం

- 8నెలలుగా భర్తీకాని వైనం
- త్రివిధ దళాధిపతుల అర్హతపై సందేహాలు
- ప్రశ్నార్థకంగా కేంద్రప్రభుత్వ వైఖరి

చండీగఢ్ : దేశానికి కొత్త సీడీఎస్ అవసరం. ఈ పదవి కోసం సమర్థుడిని నియమించడంలో కేంద్రప్రభుత్వం ఇప్పటికే ఎనిమిది నెలలు ఆలశ్యం చేసింది. మరింత జాప్యం తగదని సీనియర్లు, నిపుణులు సూచిస్తున్నారు. సీడీఎస్‌గా అర్హులైన వారు ప్రభుత్వానికి కనిపించడం లేదా అన్న ప్రశ్నకు కేంద్రప్రభుత్వ వైఖరి తావిస్తోందన్న అభిప్రాయం ఉంది. త్రివిధ దళాధిపతులు, సైన్యాధికారుల అర్హతపై ప్రభుత్వం సందేహాస్పదంగా వ్యవహరించడంతో చాలా అనుమానాలు, ప్రశ్నలు వస్తున్నట్లు సీనియర్లలో కొందరు అన్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) పదవి ఎనిమిది నెలలుగా ఖాళీగా ఉంది. 2021 డిసెంబరులో జనరల్ రావత్ హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయినప్పటి నుంచి ఎవరినీ కొత్త సీడీఎస్ నియామకంపై ప్రభుత్వం చొరవ చూపలేదు. ఇటీవల ఓ నోటీఫికేషన్‌ను రక్షణశాఖ విడుదల చేసింది. అందులో 65 ఏళ్లు ఉన్నవారు లేదా అంతకంటే తక్కువ వయస్సు ఉండి త్రీస్టార్ అధికారిగా రిటైర్మెంట్ పొంది లేక సర్వీసులో కొనసాగే వారు ఈ పదవికి అర్హులని వెల్లడించింది. దీనిపై కొందరు సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనేక సమస్యలు వస్తాయని హెచ్చరించారు. పదవీ విరమణ పొందిన త్రీస్టార్ అధికారిని సీడీఎస్ చేయాలన్న ప్రతిపాదన బాధిస్తోందని, దీనిని అంగీకరించడం సైనిక వర్గానికి కష్టసాధమని కొందరు అన్నారు. మరొక నక్షత్రాన్ని భుజంపై/మణికట్టుపై చేర్చి త్రీస్టార్ అధికారికి సీడీఎస్ పదవి కట్టబెడితే రోజువారీ కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం తప్పదని, అంతర్గతంగా సమస్యలు వస్తాయని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం సైనిక నియామకాలను రాజకీయం చేస్తోందని కొందరు అభిప్రాయపడగా భద్రతాపరంగా అనేక సవాళ్లను దేశం ఎదుర్కొనే సమయంలో సీడీఎస్ 'అనవసరం' అన్న అభిప్రాయాన్ని సీనియర్లు వ్యక్తంచేశారు. లఢక్ గాల్వాన్ లోయలో చైనా, భారత్ సైనికుల మధ్య ఘర్షణ, కశ్మీర్‌లోకి సాయుధ చొరబాటులు వంటివి ప్రస్తావించారు. జనరల్ రావత్ 2020లో చేపట్టిన ఆపరేషన్లు పూర్తి చేయాల్సి ఉన్న క్రమంలో సీడీఎస్ కోసం త్రివిధ దళాలు వేచివున్నాయి. త్రివిధ దళాల ప్రత్యేక దళాలు, సైబర్‌స్పేస్, స్పేస్ కమాండ్స్ కార్యాచరణనూ పూర్తి చేయాల్సి ఉంది. యుద్ధక్షేత్రంలో వనరుల కొరతను తీర్చేందుకు ముఖ్యంగా ఏరియల్ అసెట్స్ (వైమానిక ఆస్తులు), క్షీణిస్తున్న వార్షిక రక్షణ వ్యయాల సద్వినియోగం, ఇంట్రా-ఇంటర్ సర్వీస్ నెట్‌వర్క్ ఆధారిత యుద్ధం దిశగా మార్గదర్శకాలకూ సీడీఎస్ అవసరం ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా అగ్నిపథ్ పథకంలో సిబ్బంది నియామకాల క్రమంలో సీడీఎస్ మార్గదర్శకత్వం అవసరం. సీడీఎస్ నియామకాన్ని మరింత జాప్యం చేసేందుకు ఎలాంటి కారణాలులేవుగానీ ప్రభుత్వ ఆలోచన మరోలా ఉండటం గమనార్హం.

ఆప్ 'యూటర్న్'

దిల్లీలో మళ్లీ పాత మద్యం విధానమే

వెనక్కి తగ్గిన కేజ్రీవాల్ ప్రభుత్వం

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని నూతన ఎక్సైజ్ విధానంపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సీబీఐ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పాలసీని ఉపసంహరించుకుంటున్నామని, మరో ఆరు నెలల పాటు పాద మద్యం విధానాన్నే కొనసాగించనున్నట్లు ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా శనివారం వెల్లడించారు. అంతేగాక, ప్రభుత్వం నిర్వహించే దుకాణాల ద్వారానే మద్యాన్ని విక్రయించాని ఆదేశించారు. గతేడాది నవంబర్ నుంచి నూతన మద్యం విధానం 2021-22ను దిల్లీ ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. అయితే ఈ విధానంపై విమర్శలు రావడంతో పాటు ఎల్‌జీ సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడంతో దిల్లీ ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

బీజేపీపై సిసోడియా ఫైర్

ఈ సందర్భంగా బీజేపీపై సిసోడియా తీవ్రంగా మండిపడ్డారు. గుజరాత్‌లో మాదిరిగానే దిల్లీలోనూ అక్రమ మద్యం వ్యాపారాలు చేసేందుకు కాషాయ పార్టీ యత్నిస్తోందని దుయ్యబట్టారు. 'దిల్లీలో మద్యం కొరత సృష్టించేందుకు బీజేపీ యత్నిస్తోంది. అలా దిల్లీలో అక్రమంగా మద్యం వ్యాపారం చేయాలని చూస్తున్నారు. లిక్కర్ లైసెన్సులు తీసుకున్న వారిని ఈడీ, సీబీఐ సంస్థలతో బెదిరిస్తున్నారు. దీంతో చాలా మంది దుకాణాలు మూసేస్తున్నారు. కానీ, మేం అలా జరగనివ్వం. ఇక నుంచి ప్రభుత్వ దుకాణాల ద్వారానే మద్యం విక్రయాలు జరిగేలా కఠిన చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించాం" అని సిసోడియా వెల్లడించారు. దీంతో దిల్లీలోని 468 ప్రైవేటు మద్యం దుకాణాలు ఆగస్టు 1వ తేదీ నుంచి మూతబడనున్నాయి. దిల్లీలోని నూతన మద్య విధానం కింద మద్యం సేవించేవారి వయసు 21ఏళ్లకు తగ్గించడం, షాపుల సంఖ్య పెంచడం, వీటి విక్రయాలను పూర్తిగా ప్రైవేటుకే అప్పగించడంతోపాటు మద్యం దుకాణాలను సూపర్‌మార్కెట్లుగా నిర్వహించుకునేందుకు వీలు కల్పించడం వంటి విషయాలపై విపక్షాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. మరోవైపు కొత్త ఎక్సైజ్ విధానంలో.. కొన్ని లోపాలు ఉన్నాయని, టెండర్ల జారీ తర్వాత మద్యం లైసెన్సుదారులకు అనుచిత లబ్ధి చేకూర్చేలా దీన్ని తయారుచేశారని దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇటీవల ఓ నివేదిక ఇచ్చారు. దీనివల్ల ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లినట్లు నివేదికలో తెలిపింది. ఈ నివేదిక ఆధారంగా ఈ విధానంపై దర్యాప్తు జరపాలని లెఫ్టినెంట్ గవర్నర్ సీబీఐకి సిఫార్సు చేశారు. నూతన మద్యం విధానంలో చోటుచేసుకున్న నియమాల ఉల్లంఘనతో పాటు విధానపరమైన లోపాలపై దర్యాప్తు చేపట్టాలని సూచించారు.

జిల్లాస్థాయిలో న్యాయ వ్యవస్థ

పేదల కోసమే: సుప్రీం జస్టిస్ లలిత్

న్యూఢిల్లీ: దేశంలో పేదలు, అణగారిన వర్గాలకు న్యాయ సేవలు అందుబాటులోకి రావాలన్న ఉద్దేశంతో జిల్లా స్థాయిలో న్యాయ వ్యవస్థ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఇదే రకమంలో జాతీయ న్యాయ సేవల యంత్రాంగం (ఎన్ఏఎల్ ఎస్ఏ) పరిధిలో 'న్యాయ సాయం' వ్యవస్థ ఏర్పాటు కానుంది అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ శనివారం తెలిపారు. ఎల్ఏ ఎల్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్‌గానూ జస్టిస్ లలి త్ ఉన్నారు. ఈయన అఖిలభారత జిల్లా న్యాయ సేవల యంత్రాంగం తొలి సమావేశంలో మాట్లా దారు. వక్తల్లో ప్రధాని మోదీ, సీజేఐ ఎన్వీ రమణ కూడా ఉన్నారు. అనేక అంశాలపై ప్రస్తావించారు. న్యాయ సాయం కోసం నిరీక్షిస్తూ జైళ్లల్లో మగ్గుతున్న విచారణ ఖైదీలకు విముక్తిపైనా వక్తలు మాట్లాడారు. జస్టిస్ లలిత్ మాట్లాడుతూ, ప్రైవేటు లాయర్ల ఖర్చు ను భరించలేని పేదల కోసం న్యాయ సాయ డిఫెన్స్ కౌన్సిల్ ఏర్పాటు దిశగా ఎన్ఏఎల్ఎస్ఏ ఆలోచన చేస్తోందని, ఇందుకోసం 350 జిల్లాలను ఎంపిక చేసిందని చెప్పారు. తొలి దశలో డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థ మొదలు అవుతుందని రెండవ దశలో ప్రక్రియ పూర్తి అవుతుందని అన్నారు. దేశంలో ఎంపిక చేసిన 350 జిల్లాల్లో 112 జిల్లాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. మౌలికవసతులు, అవకాల కల్పన వంటివి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. విచారణ ఖైదీల కోసం నోడల్ కార్యాలయంగా జిల్లా న్యాయ సేవల యంత్రాంగం (డీఎల్ఎస్ఏ) ఉంటుందని చెప్పారు. 42 రోజుల పాన్ ఇండియా అవగాహన కార్యక్రమాన్ని ప్రస్తావించారు. ఇందులో భాగంగా రాష్ట్ర -జిల్లా స్థాయి న్యాయ సేవల యంత్రాంగాల ద్వారా అన్ని గ్రామాలను చేరుకోవాలని, ప్రజలకు న్యాయ సేవలపై అవగాహన కల్పించాలని ఎన్ఏఎల్ఎస్ఏ ప్రయత్నిస్తోందన్నారు. దేశంలో న్యాయ సహాయ సేవలకు 25ఏళ్లు పూర్తి అయినట్లు తెలిపారు. అనుభవాలు చాలా నేర్పాయన్నారు. 15 నెలల్లో రెండు విస్తృత ఆలోచనలపై పని జరుగోతందని, లోక్ అదాలత్ విజయవంతం అయిందని, 42 రోజుల అవగాహన కార్యక్రమం కూడా నిర్దేశిత కాలంలోగా పూర్తి అవుతుందని జస్టిస్ లలిత్ తెలిపారు. ఈ-లైబ్రరీ సేవలనూ అందించాలని భావిస్తున్నట్లు చెప్పారు. రెండ్రోజుల సమావేశానికి దేశ నలుమూలల నుంచి 1200 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

విచారణ ఖైదీల విడదలే లక్ష్యం.. : రిజీజూ

ఆగస్టు 15న సాధ్యమైనంత ఎక్కువ మంది విచారణ ఖైదీలను విడుదల చేయడమే లక్ష్యంగా ఎన్ఏఎల్ఎస్‌సే కార్యక్రమం సాగుతోందని న్యాయ మంత్రి కిరణ్ రిజీజూ అన్నారు. ఈ కార్యక్రమం జులై 16న మొదలు అయిందని చెప్పారు. ప్రతి వారం విచారణ ఖైదీల సమీక్షా కమిటీలు (యూటీ ఆర్‌సీలు) భేటీ అయి పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు తెలిపారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో బెయిల్ అర్జీలు, అదనపు కేసులు వంటి అంశాలపై చర్చిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 13 వరకు ఇలా ప్రతి వారం సమావేశాలు జరుగుతాయన్నారు. ఆగస్టు 15న సాధ్యమైనంత ఎక్కువ మంది విచారణ ఖైదీలను విడుదల చేయడమే లక్ష్యమని తెలిపారు. హర్ ఘర్ తిరంగా ప్రచారాన్ని ప్రస్తావిస్తూ న్యాయవ్యవస్థ భాగస్వామ్యాన్ని న్యాయమంత్రి కోరారు.

విద్యుత్ రంగ సంస్థల బకాయిలు చెల్లించండి

రాష్ట్రాలను కోరిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దాదాపు రూ.2.5 లక్షల కోట్లుగా అంచనా వేసిన విద్యుత్ రంగ సంస్థల బకాయిలను చెల్లించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. విద్యుత్ సంస్థలకు రూ.75 వేల కోట్ల సబ్సిడీ హామీలను రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా చెల్లించకపోవడం పై ప్రధాని విచారం వ్యక్తం చేశారు. 'ఉజ్వల్ భారత్ ఉజ్వల్ భవిష్య-పవర్ ఏ2047' ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి, పంపిణీలో నిమగ్నమైన కంపెనీలకు చెందిన సుమారు రూ.2.5 లక్షల కోట్లు నిలిచిపోయాయని తెలిపారు. విద్యుత్ కష్టాల రోజులను గుర్తు చేసుకుంటూ, గత ఎనిమిదేళ్లలో దేశాభివృద్ధికి అవసరమైన దాదాపు 1,70,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచామని ప్రధాని చెప్పారు. దేశానికి కావాల్సింది 'రాష్ట్రనీతి' తప్ప 'రాజనీతి' కాదని అన్నారు. స్థాపిత సౌర సామర్థ్యం పరంగా ప్రపంచంలోని మొదటి 4-5 దేశాలలో భారతదేశం ఒకటి అని, ప్రపంచంలోని అతిపెద్ద సౌర కేంద్రాల్లో ఒకటిగా కూడా ఉందని ఆయన తెలిపారు.

అంతకుముందు, రాజస్థాన్‌లో 735 మెగావాట్ల నోఖ్ సౌర ప్రాజెక్టు, లేహ్‌లో గ్రీన్ హైడ్రోజన్ మొబిలిటీ ప్రాజెక్టు, గుజరాత్‌లో కవాస్ గ్రీన్ హైడ్రోజన్ సహజ వాయువు ప్రాజెక్టుకు ప్రధాని శంకుస్థాపన చేశారు. లేహ్‌లోని ప్లాంట్ వాహనాలకు గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తుంది. అలాగే పునరుద్ధరించబడిన పంపిణీ రంగ పథకం, జాతీయ సౌర రూఫ్‌టాప్ పోర్టల్‌ను కూడా మోదీ ప్రారంభించారు.

జోరుగా 5జీ బిడ్డింగ్

ఇప్పటికే స్పెక్ట్రమ్‌లో 71శాతం విక్రయం

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద వేలంపాటగా 5జీ బిడ్డింగ్ జోరుగా సాగుతోంది. శనివారం ఐదవ రోజు పోటాపోటీగా ఉంది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ వంటి దిగ్గజాల నుంచి రూ.1,49,855 కోట్ల విలువ చేసే బిడ్‌లు రాగా రేడియో తరంగాల వేలం ఆసక్తికరంగా సాగింది. నాలుగు రోజుల్లో స్పెక్ట్రమ్‌లో 71శాతం అమ్ముడుపోయినట్లు టెలికం మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వేలానికి మంచి స్పందన వచ్చిందన్నారు. శుక్రవారం ఏడు రౌండ్లలో బిడ్డింగ్ జరిగిన క్రమంలో రూ.231.6 కోట్లు పెరిగాయి. శుక్రవారం వరకు మొత్తం 23 రౌండ్లలో బిడ్డింగ్ జరిగింది. యూపీ ఈస్ట్ సర్కిల్ కోసం 1800 ఎంహెచ్‌జెడ్ బ్యాండ్ కొనుగోలుకు జియో, ఎయిర్‌టెల్ పోటీ పడ్డాయి. మొత్తంగా రూ.4.3లక్షల కోట్లు విలువగల 72 జిగాహెర్ట్జ్ రేడియో తరంగాలు బ్లాకులో ఉన్నాయి.

బీజేపీది అధికార దురంహకారం

- ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు
- ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్

ముంబై : పార్లమెంటులో మెజారిటీ ఉన్నందునే బీజేపీ అధికార దురహంకారాన్ని ప్రదర్శిస్తోందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధినేత శరద్ పవార్ అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా సామాన్యులు ఏకమయ్యే రోజులు రానున్నాయని తెలిపారు.

ఇక్కడికి 325 కిలోమీటర్ల దూరంలోని ధూలేలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి పవార్ మాట్లాడుతూ, బ్రిటిష్ సామ్రాజ్యంలో సూర్యుడు ఎప్పుడూ అస్తమించడని ఒక పురాణం ఉందని, అయితే సామాన్యులు ఏకమయ్యాక అది కూలిపోయిందని అన్నారు. అదేవిధంగా అధికార దురహంకారాన్ని ప్రదర్శించే బీజేపీకి గుణపాఠం చెప్పే సత్తా సామాన్యులకు ఉందని పవార్ చెప్పారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి చేసిన వ్యాఖ్యపై లోక్‌సభలో బీజేపీ ఎంపీలు, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ మధ్య జరిగిన వాగ్వాదాన్ని ప్రస్తావిస్తూ, అధికార పార్టీ పార్లమెంటేరియన్ల తీరును ఎన్‌సీపీ అధినేత ఎండగట్టారు. సహచర ఎంపీ చేసిన వ్యాఖ్యలపై తన పేరును ఎందుకు లాగుతున్నారని సోనియా గాంధీ బీజేపీ ఎంపీలను ప్రశ్నించగా, ఆమెను అడ్డుకున్నారని అన్నారు. 'సంబంధిత ఎంపీ రాష్ట్రపతికి తప్పుడు పదం వాడారు.

తన తప్పును గ్రహించి క్షమాపణలు చెప్పారు. కానీ సోనియా గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ కోరింది. ఆమెను బీజేపీ ఎంపీలు, మంత్రులు అడ్డుకున్నారు. మా ఎంపీ (కుమార్తె సుప్రియా సూలే) ఆమెను బయటకు పంపించారు. ఆమె వాహనం.. లేకుంటే అక్కడ ఏదైనా జరిగి ఉండేది' అని పవార్ పార్టీ కార్యకర్తలతో అన్నారు. 'మీరు ఏకీభవించకుంటే తీవ్ర చర్యలు తీసుకోగలమన్న బీజేపీ అధికార దురంహకారం అటువంటిది' అని ఎన్‌సీపీ అధినేత తెలిపారు. గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీని విమర్శిస్తూ, గత రెండేళ్లుగా అసెంబ్లీ స్పీకర్ ఎన్నికను అనుమతించలేదని, అయితే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు రోజుల్లో అనుమతించారని పవార్ అన్నారు.

'గవర్నర్ ప్రవర్తన ఇలాగే ఉంటే, ప్రజాస్వామ్యం ఏమవుతుంది? ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఎలాగైనా రక్షించడం మన కర్తవ్యం' అని శరద్ పవార్ నొక్కి చెప్పారు.

వృద్ధుల సమస్యలకు

కేరళలో ప్రత్యేక కమిషన్

కొచ్చి: దాదాపు 42 లక్షల మంది వృద్ధులు ఉన్న కేరళలో, మహిళలు, యువకులు, పిల్లల హక్కుల ప్యానెల్ తరహాలో వృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు కూడా త్వరలో ప్రత్యేక కమిషన్‌ను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వృద్ధులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపుల ఫిర్యాదుల దృష్ట్యా వృద్ధుల సమస్యలు, ఆందోళనలను పరిష్కరించడానికి రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వం ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తోందని సామాజిక న్యాయం, ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్ బిందు తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం, రక్షణకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి మెయింటెనెన్స్ ట్రిబ్యునల్ అదాలత్‌ను కలమసేరిలో 'కనీవు' కార్యక్రమం జిల్లా స్థాయి ప్రారంభోత్సవంలో మంత్రి ప్రకటించారు. సీనియర్ సిటిజన్ల పట్ల శ్రద్ధ వహించి జీవించేందుకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన నైతిక బాధ్యత సమాజంపై ఉందని బిందు అభిప్రాయపడ్డారు. వృద్ధుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను సామాజిక న్యాయ శాఖ ద్వారా క్లబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆమె తెలిపారు. 2006లో సీనియర్ సిటిజన్‌లకు గరిష్ట సంక్షేమ చర్యలను అందించడానికి 'వృద్ధాప్య విధానాన్ని' ప్రవేశపెట్టిన రాష్ట్రాల్లో కేరళ ముందుంది.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- పాలనలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలం
- బీజేపీని ఎదుర్కొనే సత్తా కమ్యూనిస్టులకే ఉంది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర - నంద్యాల: బీజేపీ కుటిల రాజకీయాలను ఎదుర్కొనే సత్తా కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఏపీ రాజధాని విషయంలో బీజేపీ నేతలు నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రాజధాని నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రి అమిత్ షాతో సీఎం జగన్‌కు ఫోన్ చేయిస్తే నిర్మాణాలు ఎందుకు జరగవని ప్రశ్నించారు. శనివారం సీపీఐ నంద్యాల జిల్లా ప్రథమ మహాసభల నేపథ్యంలో జిల్లా కార్యదర్శి రంగనాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరయిన రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కాకుండా నిలువరించడం, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. వైసీపీ ప్లీనరీలో ఆ పార్టీ నేతలంతా సీఎం జగన్‌కు భజన చేశారని ఎద్దేవా చేశారు. పాలన చేతకాని జగన్ ప్రతిపక్షాలను, మీడియాను విమర్శించడాన్ని తప్పుబట్టారు. భారీ మెజారిటీతో గెలిచిన సీఎం చేసిన అభివృద్ధి ఎక్కడుందని ప్రశ్నించారు. ఒక ప్రాజెక్టు కట్టారా... ఒక పరిశ్రమ అయినా తెచ్చారా అంటూ జగన్‌ను నిలదీశారు. వైసీపీ చేసిన అభివృద్ధిపై విజయవాడ, కర్నూలు, నంద్యాలలో ఎక్కడైనా తాము చర్చకు సిద్ధమని సవాలు విసినారు. నంద్యాల జిల్లాకు చెందిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అప్పుల శాఖ మంత్రిగా మారారని, ఆయన అప్పులు తెస్తేనే ప్రభుత్వం నడుస్తుందని, లేకపోతే జీతాలు, పెన్షన్లు కూడా ఇచ్చే స్థితి లేదని చురకలంటించారు. పోలవరం నిర్వాసితులకు ఇంతవరకు పరిహారం చెల్లించలేదని, పరిహారం అడిగితే కేంద్రం ఇవ్వలేదని అనడం దుర్మార్గమన్నారు. 23 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచుతానన్న సీఎం నేడు మోదీ కాళ్లపై మోకరిల్లుతున్నారని విమర్శించారు. పోలవరం లేకుంటే ఆంధ్రకు భవిష్యత్ లేదన్నారు. పోలీసుల వేధింపులు తాళలేకనే నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబంలో నలుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన హజీరా అనే మైనారిటీ బాలికపై అత్యాచారం చేసి హత్య చేస్తే నేటికీ నిందితులను అరెస్టు చేయలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందని తెలిపారు. కేంద్రంలో ప్రధాని మోదీ అసమర్థత పాలన సాగిస్తున్నారని, 8 సంవత్సరాల పాలనలో ఆయన చేసిందేమీ లేదన్నారు. ధరలను అదుపు చేయడంలో, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో తీవ్రంగా విఫలమయ్యారన్నారు. బీజేపీ దుష్టరాజకీయాలను ఎదుర్కొనే సత్తా సీపీఐకే ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో రానున్న అక్టోబర్ 14 నుంచి విజయవాడలో జరిగే పార్టీ జాతీయ మహాసభలకు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మిలిటెంట్ పోరాటం చేసిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. నాడు జనసంఘ్ రూపంలో ఉన్న బీజేపీ బ్రిటీష్ వారి అడుగులకు మడుగులొత్తిందని గుర్తు చేశారు. అటువంటి సంఘ్ పరివార్ నేత వీడీ సావర్కర్ చిత్రపటాన్ని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో పెట్టడం దారుణమన్నారు. స్వాతంత్ర్యానంతరం దున్నేవాడిదే భూమి అని పార్లమెంట్‌లో చట్టం తీసుకురావడంలో సీపీఐ కీలకపాత్ర పోషించిందని చెప్పారు. ఈ దేశంలో కమ్యూనిస్టులు లేకుండా అభివృద్ధి లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి అన్నారు. మోదీ పగటి వేషగాడిలా ఎక్కడికి పోతే ఆ వేషం కడుతున్నారని ఆరోపించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, రామాంజనేయులు, కర్నూలు జిల్లా కార్యదర్శి రంగనాయుడు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, పార్టీ నాయకులు రాధాకృష్ణ, సుంకయ్య, సుగుణమ్మ, నబిరసూల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై జేవీఎస్ఎన్ మూర్తి, హరినాథరెడ్డి, రంగనాయుడు, రామచంద్రయ్య, రామాంజనేయులు తదితరులు

సభకు హాజరైన సీపీఐ శ్రేణులు

భారీ ప్రదర్శన

సీపీఐ నంద్యాల జిల్లా ప్రథమ మహాసభ సందర్భంగా నంద్యాల పట్టణంలో పార్టీ శ్రేణులు, ప్రజానాట్య మండలి కళాకారులు డప్పు చప్పుళ్లతో భారీ ప్రదర్శన నిర్వహించారు. మార్కెట్ యార్డు నుంచి శోభా సర్కిల్, శ్రీనివాస సెంటర్ మీదుగా రామకృష్ణ డిగ్రీ కళాశాల సమీపంలోని టౌన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శన అగ్ర భాగాన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి, కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, రామాంజనేయులు, కర్నూలు, నంద్యాల జిల్లా కార్యదర్శులు గిడ్డయ్య, రంగనాయుడు, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాసినోకు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖులు

ఒక్కో టేబుల్‌పై రూ.3 కోట్లు

హైదరాబాద్: క్యాసినో వ్యవహారంలో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఆరు నెలల క్రితం శ్రీలంకలో జరిగిన క్యాసినోలో రూ.కోట్లు చేతులు మారినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. పేకాట రాయుళ్లు ఒక్కో టేబుల్‌పై రూ.3 కోట్లు పెట్టి ఆడినట్లు దర్యాప్తులో తేలింది. వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు ఉన్నట్లు.. హవాలా మార్గంలో వారు డబ్బులు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇక్కడ నగదు ఇస్తే క్యాసినోలో చీకోటి ప్రవీణ్ కాయిన్స్ సమకూరుస్తున్నట్లు తెలిపారు. బడా పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, సినీ రంగానికి చెందిన వారిని ప్రవీణ్ తరచూ క్యాసినోకు తీసుకువెళ్లేవాడని చెప్పారు. కాల్ గర్ల్స్‌తో వారికి ప్రవీణ్ అండ్ గ్యాంగ్ ఆతిథ్యం ఏర్పాటు చేసేవారని వెల్లడించారు. ఇండోనేషియా, థాయిలాండ్, నేపాల్‌లోనూ రూ.కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.

తగ్గిన పారిశ్రామిక కార్మికుల రిటైల్ ద్రవ్యోల్బణం

జూన్‌లో 6.16 శాతానికి...

న్యూఢిల్లీ: పెట్రోలు, కొన్ని ఆహార పదార్థాల ధరలు తగ్గిన కారణంగా పారిశ్రామిక కార్మికుల రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది మేలో 6.97 శాతం నుంచి జూన్‌లో 6.16 శాతానికి తగ్గింది. 'గత నెల (మే 2022) 6.97 శాతంతో పోలిస్తే ఈ నెలలో వార్షిక ద్రవ్యోల్బణం 6.16 శాతంగా ఉంది. అంతకు ముందు సంవత్సరం ఇదే నెలలో (జూన్ 2021) 5.57 శాతంగా ఉంది' అని కార్మిక మంత్రిత్వ శాఖ ప్రకటన పేర్కొంది. ఆహార ద్రవ్యోల్బణం జూన్‌లో 6.73 శాతంగా ఉంది. గత నెలలో 7.92 శాతం, జూన్ 2021లో 5.61 శాతంగా ఉంది. జూన్‌కి పారిశ్రామిక కార్మికులకు వినియోగదారుల ధర సూచి 0.2 పాయింట్లు పెరిగి 129.2 పాయింట్ల వద్ద నిలిచింది. మే 2022లో ఇది 129 పాయింట్లుగా ఉంది. ప్రస్తుత సూచీలో గరిష్ఠంగా పైకి వచ్చే ఒత్తిడి మొత్తం మార్పునకు ఆహార, పానీయాల నుంచే 0.20 శాతం పాయింట్లు వచ్చాయి. బంగాళదుంప, ఉల్లి, టమాటా, క్యాబేజీ, యాపిల్, అరటిపండు, కొత్తిమీర, మిరపకాయలు, ఎండు మిర్చి, తాజా చేపలు, పౌల్ట్రీ చికెన్, వడ, ఇడ్లీ దోసె, వండిన భోజనం, వంట గ్యాస్, కిరోసిన్, నూనె, దేశీయ విద్యుత్ తదితరాలు సూచీ పెరుగుదలకు కారణమయ్యాయి.

అలా మాట్లాడితేనేగా రివార్డులు వచ్చేది: ఆల్వా

న్యూఢిల్లీ: గుజరాతీలు, రాజస్థానీలు నగరాన్ని వీడితే ముంబై వద్ద డబ్బు ఉండదని మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారి చేసిన వ్యాఖ్యలపై విపక్షాల తరపు ఉపరాష్ట్రపతి అభ్యర్థి మార్గరెట్ ఆల్వా తీవ్రంగా స్పందించారు. మూర్ఖంగా మాట్లా డొద్దు అని గవర్నర్‌నుద్దేశించి అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తేనేకదా అధికార బీజేపీ మెప్పు పొందేది అని విమర్శించారు. తన ప్రత్యర్థి బెంగాల్ గవర్నర్ జగదీప్ ధన్కర్ కూడా రాజ్యాంగేతర అధికారిగా వ్యవహరించి రివార్డు పొందారని దుయ్యబట్టారు. 'మహారాష్ట్ర గవర్నర్ వ్యాఖ్యలు దురదృష్టకరమేగానీ ఊహించనవి కాదు. పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్, ఉపరాష్ట్రపతి అభ్యర్థి నుంచి ఆయన దీనిని నేర్చుకున్నారు. వివాదం, మూర్ఖపు వ్యాఖ్యలు, రాజ్యాంగేతర అధికారిగా వ్యవ హరించడం వల్ల రివార్డులు పొందవచ్చునని సందేశమిచ్చారు' అని ఆల్వా ట్వీట్ చేశారు. విపక్ష నేతలు సైతం కోశ్యారి తీరును దుయ్యబట్టారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. అయితే తన మాటలను వక్రీకరించారని మహారాష్ట్ర గవర్నర్ వివరణ ఇచ్చుకున్నారు.

ఆలోగా టీఎంసీ నిర్ణయించుకోవచ్చు

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విపక్ష అభ్యర్థిగా తనకు మద్దతిచ్చే విషయమై నిర్ణయించుకునేందుకు సరిపడ సమయం టీఎంసీకి ఉందని మార్గరెట్ ఆల్వా అన్నారు. మనస్సాక్షి ప్రకారం ఓటు వేసేందుకు తమ ఎంపీలకు అనుమతి ఇవ్వాలని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీని కోరారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలను టీఎంసీ బహిష్కరిస్తే విపక్షానికి ప్రయోజనం ఉండదుగానీ అధికార బీజేపీకి లాభం చేకూరుతుందని చెప్పారు. 'ప్రతిపక్ష కూటమిలో టీఎంసీ కీలకం. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తటస్థంగా ఉంటే విపక్షానికి కాదు అధికార పక్షానికి లాభం చేకూరుతుంది' అని ఆల్వా ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

కమర్షియల్ మైనింగ్ పేరిట

బొగ్గుగనుల ప్రైవేటీకరణ

- సింగరేణిపైనా కేంద్రం కన్ను
- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్ జిత్ కౌర్

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : కమర్షియల్ మైనింగ్ పేరిట భారతదేశంలోని కోల్ ఇండియాకు చెందిన బొగ్గుగనులతో పాటు సింగరేణిని కూడా ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జిత్ కౌర్ అన్నారు. ఈ చర్యలను ఏఐటీయూసీ తరపున పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు అన్నారు. శనివారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నగరంలో ఇండయన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) 13వ మహా మహా సభ ప్రారంభం అయ్యింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ ప్రసంగిస్తూ దేశానికి స్వాతంత్రం రాక ముందే బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, అధిక పని గంటలకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ పోరాటం చేసిందని గుర్తు చేశారు. 1920లో ఏర్పాటైన ఏఐటీయూసీ దేశానికి పూర్తి స్వాతంత్రం కావాలి అని పిలుపునిచ్చిందని చెప్పారు. ఏఐటీయూసీ స్థాపించబడిన నాటి నుంచి ఇప్పటి వరకు బొగ్గు, రైల్వే, బ్యాంక్, భీమా రంగాలలో పని చేస్తున్న కార్మికుల హక్కులు కాపాడుకుంటూ కార్మిక చట్టాలు రూపొందించుకోవడంలో ప్రధాన భూమిక నిర్వహించిందని అన్నారు. నేడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి, శ్రామిక వర్గంపై ఉక్కు పాదం మోపుతుందని విమర్శించారు. కమర్షియల్ కోల్ మైనింగ్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు బొగ్గు గనులు అప్పగించడం, మోనిటైజేషన్ పైప్ లైన్ పేరుతో ప్రభుత్వ ఆస్తుల అమ్మకానికి పెడుతోందని దుయ్యబట్టారు. అత్యవసర పరిస్థితుల్లో, యుద్ధ సమయాల్లో వాడుకోనే రిజర్వ్ బ్యాంకులోని మూలధనాన్ని కూడా ప్రభుత్వం వాడుకుంటోందని విమర్శించారు. రక్షణ, అంతరిక్ష రంగంలోనూ కార్పొరేట్ శక్తుల ప్రమేయాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలకు కళ్లెం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో సమిష్టి పోరాటాలు చేయక పోతే శ్రామిక వర్గానికి తీవ్ర ప్రమాదం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షులు రమేంద్ర కుమార్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, దేశంలోని వివిధ బొగ్గు పరిశ్రమల కార్మిక నాయకులు, వేజ్ బోర్డ్ సభ్యులు, ఆయా రాష్ట్రాల్లో బొగ్గగని కార్మికుల సమస్యలపై మాట్లాడారు. రెండు రోజులు జరిగే ఈ సమావేశాలకు దేశంలోని అన్నిప్రాంతాల బొగ్గు గనుల కార్మిక ప్రతినిధులతో పాటు సింగరేణి బొగ్గు గనుల నుంచి ముఖ్య నేతలు ప్రతినిధులుగా పాల్గొన్నారు. బొగ్గు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, వేతన సవరణ తదితర అంశాలపై వివిధ తీర్మానాలు చేయనున్నట్టు నేతలు తెలిపారు.

సెతల్వాద్, శ్రీకుమార్‌కు బెయిల్ నిరాకరణ

అహ్మదాబాద్: 2002 అల్లర్ల కేసుల్లో అమాయకులను ఇరికించేందుకు కల్పి పత్రాలను రూపొందించిన ఆరోపణలపై అరెస్టయిన కార్యకర్త తీస్తా సెతల్వాద్, మాజీ డీజీపీ ఆర్.బి.శ్రీకుమార్‌కు అహ్మదాబాద్‌లోని ఒక సెషన్స్ కోర్టు శనివారం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ రెండు ఉత్తర్వులను తిరస్కరిస్తున్నట్లు అదనపు ప్రిన్సిపల్ జడ్జి డి.డి.ఠక్కర్ తెలిపారు. భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్లు 468 (మోసం చేయడం కోసం ఫోర్జరీ చేయడం), 194 (మరణశిక్ష నేరానికి శిక్షను పొందాలనే ఉద్దేశ్యంతో తప్పుడు సాక్ష్యాలను ఇవ్వడం లేదా కల్పించడం) కింద వారిపై ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) ఆధారంగా సెతల్వాద్, శ్రీకుమార్‌ను నెల రోజుల క్రితం సిటీ క్రైమ్ బ్రాంచ్ అరెస్టు చేసింది. నరేంద్ర మోదీ నేతృత్వంలోని నాటి బీజేపీ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కాంగ్రెస్ దివంగత నాయకుడు అహ్మద్ పటేల్ ఆదేశాల మేరకు జరిగిన పెద్ద కుట్రలో వారు భాగమని కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన అఫిడవిట్‌లో ఆరోపించింది. 2002లో గోద్రా రైలు దహనం ఘటన జరిగిన తర్వాత పటేల్ ఆదేశాల మేరకు సెతల్వాద్‌కు రూ.30 లక్షలు చెల్లించారని ఆరోపించింది. శ్రీకుమార్ ఒక 'అసంతృప్త ప్రభుత్వ అధికారి'. గుజరాత్ రాష్ట్రం మొత్తానికి ఎన్నికైన ప్రజాప్రతినిధులను, అధికార యంత్రాంగాన్ని, పోలీసు పరిపాలనను మభ్యపెట్టేలా ప్రక్రియను దుర్వినియోగం చేశాడు' అని సిట్ పేర్కొంది.

పూడిమడక విషాదం

ఐదు మృతదేహాలు లభ్యం

విశాలాంధ్ర-అచ్యుతాపురం: అనకాపల్లి జిల్లా, అచ్యుతాపురం మండలం, పూడిమడక సముద్ర తీర ప్రాంతంలో శుక్రవారం రాత్రి గల్లంతైన ఇంజినీరింగ్ విద్యార్థుల మృతదేహాలన్నీ శనివారం మధ్యాహ్నానికి లభ్యమయ్యాయి. ప్రమాదం జరిగిన శుక్రవారం రాత్రి రెండు గంటల వ్యవధిలోనే ఓ విద్యార్థి మృతదేహం లభ్యమవ్వగా, శనివారం ఐదు మృతదేహాలు లభ్యమయ్యాయి. వీటిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనకాపల్లి డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న 15 మంది విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం కళాశాలలో పరీక్షలు ముగించుకొని రాంబిల్లి మండలం, సీతపాలెం సముద్ర తీర ప్రాంతానికి వెళ్లారు. విశాఖలోని గోపాలపట్నానికి చెందిన కంపర జగదీష్, అనకాపల్లి జిల్లా, రోలుగుంటకు చెందిన జస్వంత్, గుంటూరుకు చెందిన బయ్యపునేని సతీశ్, మునగపాకకు చెందిన సూరిశెట్టి సతీశ్, ఇదే మండలంలో చూచుకొండకు చెందిన పెంటకోట గణేశ్, నర్సీపట్నం మండలం, పెద్ద బోడ్డేపల్లి గ్రామానికి చెందిన గుడివాడ పవన్, ఎలమంచిలికి చెందిన పూడి రామచంద్‌లతో పాటు మరో ఎనిమిది మంది విద్యార్థులు సముద్ర తీర ప్రాంతానికి వెళ్లారు. కొద్దిసేపు సరదాగా గడిపిన వారు, సముద్ర స్నానానికి దిగారు. ఒక్కసారిగా ఎగసిపడిన రాకాసి అల నీటిలో ఉన్న వారిని లోపలకు లాగేసింది. దీంతో ఒడ్డున ఉన్న విద్యార్థులు పెద్ద పెట్టున కేకలు వేశారు. సమీపంలో ఉన్న మత్స్యకారులు నీటిలో కొనఊపిరితో కొట్టుకుంటున్న సూరిశెట్టి తేజను కాపాడి ఒడ్డుకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అతడు విశాఖ కేజీహెచ్ ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. గల్లంతైన మిగతా ఆరుగురిలో గుడివాడ పవన్ మృతదేహం ఒడ్డు కొట్టుకు వచ్చింది. దీంతో అప్రమత్తమైన అనకాపల్లి జిల్లా అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి, జిల్లా ఎస్పీ గౌతమి సాలి గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. నేవీ హెలికాప్టర్, నాలుగు బోట్లతో కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు, మత్స్యకారుల సహాయంతో శనివారం ఉదయం నుంచి మిగతా విద్యార్థుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దీంతో శనివారం మధ్యాహ్నం నాటికి మిగతా ఐదుగురు విద్యార్థుల మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వద్ద తల్లిదండ్రులు బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.